Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 17.05.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 50 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



# మార్పు దిశగా తీర్పు?

- అత్యధిక స్థానాలతో వైసిపి గెలుపు ఖాయమని అంచనాలు
- 'జగన్‌కు ఒక్క ఛాన్స్'నినాదం సక్సెస్ అయ్యిందనే ఆత్మవిశ్వాసం
- టిడిపి ఆశలన్నీ పూర్తిగా పసుపు - కుంకుమపైనే
- మహిళల ఓట్లే గట్టెక్కిస్తాయని గట్టిగా నమ్ముతున్నారు

***సరిగ్గా వచ్చేవారం ఈ సమయానికి కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడి ప్రభుత్వాల ఏర్పాట్లకు సన్నాహాలు జరుగుతుంటాయి. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు కూడా ఖరారైపోయి వుంటారు. ఇక గట్టిగా ఐదురోజులు ఓపిక పడితే వాస్తవ ఫలితాలను చూస్తాం. అయితే మన మనసులు అప్పటిదాకా ఆగలేవు. ఈలోపు ఎన్నెన్నో వూహాగానాలు, మరెన్నో సర్వేలు... తుది విడత ఎన్నికలు ముగిసే దాకా ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల సంఘం నిషేధం విధించింది. కాబట్టి అన్ని జాతీయ మీడియా సంస్థలు, ఇతర సర్వే సంస్థలు తమ ఎగ్జిట్‌పోల్స్‌ను 19వ తేదీన వెల్లడించబోతున్నాయి.***

ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రంలో 175 శాసనసభ స్థానాలకు, 25 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పోలింగ్ దాదాపు 80శాతం వరకు నమోదైంది. ఇతర ప్రాంతాలలో స్థిరపడినవాళ్ళు సైతం అదిపనిగా బాధ్యతగా తమ గ్రామాలకు వచ్చి ఓట్లేశారు. ప్రజలు మండుటెండలను సైతం లెక్కచేయలేదు. కాళ్ళు నొప్పులు పడుతున్నా గంటలకొద్దీ 'క్యూ'లలో నిలబడి ఓట్లేశారు.

## మార్పుకు సంకేతం...

ప్రజలు మార్పును కోరుకుంటున్నారా? పెరిగిన పోలింగ్, ఓటరు ఉత్సాహం

(మిగతా 11వ పేజీలో)

# బాబుకు బ్రేకులు!

## విపక్షాల కూటమికి నేతృత్వం వహించాలనుకున్న బాబు ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు



ఇప్పుడు జరిగిన పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల్లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల తర్వాత అత్యధిక సీట్లు సాధించడానికి అవకాశమున్న పార్టీలు ఏవి? ఈ ప్రశ్నను పరిశీలిస్తే తృణమూల్ కాంగ్రెస్, డిఎంకె, ఎస్పీ, బిఎస్పీ, బిజెడి వంటి పార్టీలే... బీజేపీని వ్యతిరేకించే కూటమిలో వున్న ప్రధాన పార్టీలివే! 10 నుండి 30కి మధ్యలో సీట్లు సాధిస్తారనే ప్రచారం వుంది. విచిత్రం ఏంటంటే ఈ పార్టీల అధినేతలెవరూ ప్రధాని పదవిపై వెంపర్లాడడం లేదు. ప్రధాని పదవిపై మాట్లాడడం లేదు.

కాని, తన రాష్ట్రంలో ఎన్ని సీట్లు వస్తాయో తెలియని తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మాత్రం ప్రధాని పదవిపై రచ్చ చేస్తున్నాడు. అందరితో మీటింగ్ అంటాడు. ప్రధాని

(మిగతా 11వ పేజీలో)




# నెల్లూరులో ఫ్యాన్ స్పీడ్?

- గాలి కొడితే క్లీన్ స్వీప్ అంటున్న వైసిపి
- సగం సీట్లు మావేనంటున్న టిడిపి

***కడప తర్వాత వైసిపికి బలమైన అండగా వుండేది నెల్లూరుజిల్లానే! 2014 ఎన్నికల్లో కూడా పది సీట్లకు గాను 7 సీట్లు వైసిపి గెలిచింది. మిగిలిన 3 సీట్లు కూడా స్వయంకృతాపరాధాల వల్లే పోయాయి.***

ఈ ఎన్నికల్లోనూ జిల్లాలో వైసిపి హవా కనిపించింది. కాకపోతే ఎన్ని సీట్లొస్తాయనే దానిపైనే మీమాంస నెలకొంది. వైసిపికి ఏడు సీట్లు పక్కా అని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. వైసిపి ఖచ్చితంగా గెలుస్తుందని చెబుతున్న వాటిలో సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, ఉదయగిరి, కోవూరు, నెల్లూరురూరల్, నెల్లూరు నగరం స్థానాలున్నాయి. ఇక సర్వేపల్లి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాలలో స్థానిక పరిస్థితుల మూలంగా గట్టి పోటీ వుందని, ఎవరు గెలిచినా చాలా తక్కువ మెజార్టీయేనని అయితే జగన్ గాలి తోలితే అన్ని సీట్లు గెలుస్తామని ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఆత్మకూరులో తెలుగుదేశం అభ్యర్థి బొల్లినేని కృష్ణయ్య బాగా పనిచేశాడు. ఖర్చులోనూ, ప్రజల ముందుకు పోవడంలోనూ వైసిపి అభ్యర్థి మేకపాటి గౌతంరెడ్డి వెనుకబడ్డాడు. అయినా ఇది వైసిపికి బలమైన నియోజకవర్గం. తెలుగుదేశంకు గెలవడం అంత సులభం కూడా కాదు. అలాగే సర్వేపల్లిలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇంతకు ముందు మూడుసార్లు ఓడి పోయాడనే సానుభూతి ఓటర్లలో పని చేసుంటుందనే ఒక నమ్మకం తెలుగుదేశం వర్గాలలో వ్యక్తమవుతోంది. కావలిలో బిఎంఆర్, విష్ణులు కలిశారు కాబట్టి ఒక్క అల్లూరు మండలంలోనే టీడీపీకి 10వేలకుపైగా మెజార్టీ వస్తుందని, ఆ మెజార్టీతోనే గెలుస్తామనే ధీమాతో వున్నారు.

అయితే... టిడిపి వాళ్ళు మాత్రం గాలి ధూళి లేదని, జిల్లాలో సగం స్థానాల్లో ఖచ్చితంగా గెలుస్తామనే నమ్మకంతో ఉన్నారు.

జిల్లాలో వర్షాలు లేక ఎక్కడా పచ్చిగడ్డి కూడా మొలవడం లేదు. పొలాలు బీళ్ళుపడి పోయాయి. ఎండుగడ్డి ధర కొండెక్కి కూర్చుంది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో ఈ దుస్థితి హృదయవిదారకంగా ఉంది. అయినా అధికారగణం కానీ, ప్రభుత్వాలు కానీ పట్టించుకోవడం లేదు. కరువు కోరలు చాస్తున్నా అంతా నిమ్మకు నీరెత్తినట్లుంటున్నారే తప్ప ఎవరూ అన్నదాతల స్థితి కానీ, మూగజీవాల గోడు కానీ పట్టించుకోవడం లేదు. పాడిపంటలకు ప్రసిద్ధిచెందిన జిల్లాలో చివరికి ఎండుగడ్డి కూడా కరువైపోయింది. ఇంత దారుణం గతంలో ఎప్పుడూ లేదని, ముక్కారు పండే నెల్లూరుసీమలో పాడిపశువులు..మూగజీవాలు గుక్కెడు నీళ్ళకి, పిడికెడు పచ్చిగడ్డికి కూడా నోచుకోకపోవడం చూస్తుంటే ఎంతో బాధగా ఉందని రైతులు కంటతడిపెడుతున్నారు.



# విలవిలలాడుతున్న మూగజీవి

- ఎండుగడ్డి కూడా దొరకడం లేదు
- కబేళాలలకు తరలుతున్న పశువులు

గత నాలుగేళ్ళుగా జిల్లాలో వర్షాలు సక్రమంగా కురవక పంటపొలాలన్నీ క్రమేణా బీడుపడిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి, చెరువులు కాలువలు కూడా చుక్క నీళ్ళు లేక ఎండిపోయాయి. ఎక్కడ చూసినా కరువు కరాళ నృత్యం చేస్తోంది. దీంతో గత ఏడాదే ప్రభుత్వం జిల్లాలోని 46 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కరువు తీవ్రంగా ఉన్న మండలాల్లో 21 మండలాలను కూడా ప్రభుత్వం గుర్తించింది. అయితే, నేటికీ కరువు సాయం మాత్రం ఎవరికీ అందలేదు. కేంద్రప్రభుత్వ బృందాలు కూడా వచ్చి కరువును పరిశీలించి వెళ్ళాయి. అయినా పాలకులకు కనికరం లేదు. తీవ్ర కరువు పరిస్థితులు ఉన్న మండలాల్లో ఉదయగిరి, అనంతసాగరం, ఆత్మకూరు, కలువాయి, కలిగిరి, కొండాపురం, మర్రిపాడు, సీతారామపురం, దుత్తలూరు, వింజమూరు, చిల్లకూరు, చిట్టమూరు, సైదాపురం, వాకాడు, వెంకటగిరి, నాయుడుపేట, దక్కిలి, ఓజిలి, తడ, పొదలకూరు, రాపూరు మండలాలున్నాయి. ఈ మండలాల్లో చివరికి పశువులకు మేత కూడా దొరకని దుస్థితి దాపురించింది. దీంతో రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. జిల్లాలో సుమారు నాలుగు లక్షల దాకా గేదెలు, దున్నలు, ఆవులు, పాలిచ్చే పశువులు ఉన్నాయి. మరో పాతిక లక్షల దాకా గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటిని మేపేందుకు పశుగ్రాసం దొరక్కపోవడంతో అవి నానాటికీ శుష్కించిపోతున్నాయి. వాటిని ఎలా పోషించుకోవాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు.

## కొండెక్కిన ఎండుగడ్డి ధర...

జిల్లాలో కరువు కమ్ముకురావడంతో పాడిపశువులు, మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. వాటికి కనీసం పచ్చిగడ్డి కానీ, ఎండుగడ్డి కానీ దొరకడం లేదు. దీంతో తమ కళ్ళముందే పశువులు బక్కచిక్కి రకరకాల వ్యాధుల బారిన పడుతున్నాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో ఎక్కడా పచ్చదనం లేకపోవడంతో పశువులు ఈ మండుటెండల్లో ఎంతెంతో దూరం వెళ్ళినా పశుగ్రాసం దొరక్క పడే బాధలు వర్ణనాతీతం. పోనీ.. ఇతర ప్రాంతాలకు వెళ్ళి ఎండుగడ్డి ఎక్కడైనా కొందామని అనుకున్నా దాని ధర కొండెక్కి కూర్చుంది. ట్రాక్టర్ ఎండుగడ్డి ధర 15 వేల రూపాయలకు పైగానే ఉంది. అదీ ఎక్కడైనా దొరికితే. అయితే, అసలే కరువు వాతపడిన రైతులు అంతంత ధరలు పెట్టి గడ్డి కొనే స్తోమతు లేక, అట్లని పశువులు బక్కచిక్కిపోతుంటే చూస్తూ ఉండలేక..వారు పడే అవస్తలు చెప్పనలవి కాదు. విధిలేని పరిస్థితుల్లో మూగజీవాలను సంతలో అమ్మేసుకుంటున్నారు. ఇదే అదనుగా దళారుల దళాలొచ్చి వాటిని సలీసుగా కొనుక్కుని, ఇతర ప్రాంతాలవారికి అధికధరలకు వాటిని అమ్ముకుంటూ ధనార్జన చేసుకుంటున్నారు.

## రైతుల బాధలు వర్ణనాతీతం

జిల్లాలో రైతుల పరిస్థితులు ఇంత దయనీయంగా ఉన్నా అటు వ్యవసాయ శాఖ కానీ, ఇటు పశుసంవర్ధక శాఖ కానీ పట్టించుకోకపోవడం మరీ దారుణం. రైతులకు రకరకాల పథకాలు పెట్టి దేశానికి వెన్నెముక అయిన అన్నదాతను భలే అదుకుంటున్నామని ఊకదంపుడు ఉపన్యాసాలతో గొప్పలు చెప్పుకోవడమే తప్ప, వాస్తవానికి రైతులను నిజంగా ఆదుకున్నది మాత్రం లేదు. పశుగ్రాసం కొరత లేకుండా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాదు, ఈ మిడిమేళపు వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చడానికి, వాటికి మంచినీటి కొరత లేకుండా చేయడానికి అధికారులు ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదని, ఎంతోకాలంగా ఈ బాధలు పడుతున్నా ఎవరికీ కాస్తంత కూడా కనికరం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామగ్రామానా మంచినీటి తొట్లు పెట్టి, మోటార్లు బిగించి, బోర్లు వేసి పశువులు నీళ్ళు తాగేందుకు పెద్ద పెద్ద తొట్టెలు ఏర్పాటుచేయాలని గతంలో అధికారులు అనుకున్నా నేటికీ ఆచరణలోకి రాకపోవడం విచారకరం. అయినా.. ఎన్ని అడుగుల లోతుకు వెళ్ళినా బోర్లకు నీరందకపోతుండడం మరో దుర్గతి. అందుకే ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి ఈ కరువు పరిస్థితుల్లో జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలి. కానీ పట్టించుకునేదెవరు?..ఇకనైనా అధికారులు కనీస మానవతా దృక్పధంతోనైనా పశువులు, మూగజీవాలు మృతిచెందకుండా వాటికి నీళ్ళు, మేత అందించేందుకు ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం తక్షణం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

# ఎక్కడున్నాం మనం?..

- పదవతరగతిలో పదమూడవ స్థానం
- అట్టడుగుకు చేరుకుంటున్న ఫలితాలు

పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో మనం ఎక్కడున్నాం?.. ఫస్ట్ రావాలనుకుని లాస్ట్ వస్తున్నాం. గత ఏడాది కూడా ఇలాగే జరిగింది. అప్పటికీ ఇప్పటికీ మార్పేమీ ఉండకపోవడం దారుణం. టెన్త్ ఫలితాలు ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురుచూసిన వారికి ఈసారి ఫలితాలు నిరాశనే కలిగించాయి. రాష్ట్రస్థాయిలో జిల్లాకు 13వ స్థానం దక్కింది. అంటే చివరిస్థానం ఇదేనన్నమాట. అయితే గత ఏడాది కంటే స్వల్పంగా.. అంటే 80.13 ఉన్న ఉత్తీర్ణతా శాతాన్ని ఈసారి 83.19కి పెరగడం మినహా పెద్ద ఆశాజనకమైన మార్పేమీ లేదు. రెండేళ్ళ క్రితం నెల్లూరుకు రాష్ట్రస్థాయిలో ఉన్న 4వ ర్యాంకు..ఇప్పుడు చివరికి పడిపోవడం ఎంతైనా విచారకరం. టెన్త్ ఫలితాల్లో తూర్పుగోదావరిజిల్లా 98.19శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో అగ్రగామిగా నిలిస్తే మన జిల్లా మాత్రం 83.19 శాతంతో ఆఖరున నిల్చుంది. ప్రకాశం, చిత్తూరు, విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, అనంతపురం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, కడప, కర్నూలు వరుసగా వరుస స్థానాలు సాధించాయి. జిల్లాలో ఉత్తీర్ణత స్థాయిని పెంచేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితమివ్వలేదని నేటి ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, ఉన్నంతలో జిల్లాలోని అనేక విద్యాలయాలు, ప్రైవేట్‌స్కూళ్ళ విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించడం అభినందించాల్సిన విషయం. కొన్నిచోట్ల మునిసిపల్ స్కూళ్ళ విద్యార్థులు కూడా ఈసారి పోటీపడి చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించడం అందరికీ గర్వకారణం కూడా. కానీ రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోల్చుకుంటే మనం ఎక్కడో ఉన్నాం. అన్ని జిల్లాలతో పోల్చి చూసుకుంటే, అక్షరాస్యతకు అగ్రస్థానమిచ్చే సింహపురిసీమలో మాత్రం టెన్త్ ఫలితాల్లో వెనుకబడిపోవడం ఎంతైనా విచారకరం. జిల్లాలో మొత్తం 33,903 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 28,025 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అదే తూర్పుగోదావరిలో చూస్తే మొత్తం 68,324 మందిలో 67,088 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అంతేకాదు, మనకు ఇరుగుపొరుగున ఉన్న ప్రకాశం, చిత్తూరుజిల్లాలు కూడా వరుసగా 2, 3 స్థానాలు సాధించినా మనం మాత్రం బుద్ధిగా చివరగా వచ్చి 13లో నిల్చున్నామంటే మనం ఎంతగా వెనుకబడి ఉన్నామో అర్థమవుతుంది.

## అధమంలో కాదు.. మనం ప్రథమంలో ఉండాలి...

ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా విద్యాశాఖ జిల్లాలో విద్యాభివృద్ధిపై మరింతగా దృష్టి సారించాలి. లేకుంటే వచ్చే ఏడాది కూడా ఇదే పరిస్థితి దాపురిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉపాధ్యాయుల పనివత్తిడి తగ్గించాలి. అయ్యవార్లు నిశ్చింతగా పాఠాలు చెప్పే వాతావరణం కల్పించాలి. పాఠశాలల్లో మంచి వాతావరణం ఉండేలా చూడాలి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఏ చెట్లకిందనో, నెత్తిమీద పెచ్చులు రాలిపడే బడుల్లోనో విద్యార్థులను ఏపుకు తినకుండా మంచి వసతులు ఉండేందుకు జిల్లా ఉన్నతాధికారులు, విద్యాశాఖ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ఉండాలి. చదువు చెప్పడం మీద ఉపాధ్యాయులకు తగినంత శ్రద్ధ ఉండాలి. చదువుకోవాలనే శ్రద్ధ విద్యార్థులకూ ఉండాలి. చదువుకునేందుకు తగ్గ మంచి వాతావరణం కూడా ఉండాలి. వీటిలో ఏది లోపించినా.. ఇదిగో ఫలితాలు ఇలాగే ఉంటాయి. మన పేరు ప్రథమంలో ఉండాల్సింది.. అధమంలో ఉంటుంది. ఇకనైనా ఇలాంటి లోటుపాట్లు పూడ్చుకునేందుకు అధికారులు, ఉపాధ్యాయులు అందరూ కలసికట్టుగా కృషిచేస్తారని ఆశిద్దాం!.. ఉత్తీర్ణతలు తగ్గిపోయాయి కదా అని ఎవరూ నిరాశా నిస్పృహలకు లోనుకావాల్సిన పనిలేదు. కింది నుంచే పైకి వెళ్దాం. ఓటమి నుంచే గెలుపుకు బాటలు వేసుకుందాం. విద్యార్థుల్లో మంచి స్ఫూర్తిని నింపి, అందరూ కష్టపడి చదివేలా వారికి అవసరమైన ప్రత్యేక శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహించి తిరిగి జిల్లా సగర్వంగా మంచి ఉత్తీర్ణతలు సాధించేలా చేద్దాం!.. ఆ మేరకు నేటినుంచే కృషిని ప్రారంభిద్దాం!..'చదువుల తల్లి సింహపురి'.. అని నిరూపించుకుందాం!...

# కి'లేడి'తో వల... దోచే వాళ్ళిలా...

అర్ధరాత్రి సమయాలలో జాతీయ రహదారిపై మహిళను ఎరగా వేసి వాహనదారులను దోచుకుంటున్న నలుగురు సభ్యుల ముఠాను నెల్లూరు వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. 15వ తేదీ వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్లకు చెందిన మల్లి శ్రీనివాసులు, అయ్యప్పగుడి టీచర్స్ కాలనీకి చెందిన బి.బాలవర్ధన్‌లు ఆటో డ్రైవర్లు. వీరికి రామ్‌నగర్‌కు చెందిన ఎం.అనిల్‌తో పరిచయమేర్పడింది. అనిల్ ద్వారా సంతపేటకు చెందిన రమాదేవి వీరికి పరిచయమైంది. వీళ్ళు జల్సాలకు అలవాటుపడి ఆటోల ద్వారా వచ్చే డబ్బులు చాలకపోవడంతో రమాదేవిని అడ్డం పెట్టుకుని దారి దోపిడీలకు స్కెచ్ వేశారు. వీళ్ళ నలుగురు ఆటోలో హైవే మీదకు వెళ్లేవాళ్ళు. మగాళ్ళు ముగ్గురు ఆటోను రోడ్డు పక్కన దూరంగా పెట్టుకుని వుంటే రమాదేవి రోడ్డుపై నిలబడి అటుగా వెళ్లే లారీడ్రైవర్లు, ద్విచక్రవాహనదారులను ఆకర్షించేది. ఆమెను చూసి నరాలు లాగిన వాళ్ళు వాహనాలు ఆపేవాళ్ళు. ఆమె వారిని మాటల్లో పెట్టి పక్కకు తీసుకెళ్లేది. అక్కడే మాటు వేసివున్న మల్లి శ్రీనివాసులు, బాలవర్ధన్, అనిల్‌లు వారిపై దాడి చేసి వారి వద్ద వున్న నగదు, ఉంగరాలు, చైన్‌లు దోచుకునేవాళ్ళు. అయితే ఇలాంటివి బయట చెప్పుకుంటే పరువుపోతుందనే ఉద్దేశ్యంతో ఎవరూ పోలీసులకు చెప్పలేదు. దీంతో ఈ ముఠా కార్యకలాపాలు యధేచ్ఛగా జరిగిపోయాయి. అయితే ఈ నెల 7వ తేదీ తెల్లారుజామున జరిగిన ఓ దోపిడీతో ఈ ముఠా లీలలు వెలుగులోకి వచ్చాయి. ఆరోజు తెల్లారుజామున సుందరయ్య కాలనీ ఫ్లైఓవర్ వంతెన వద్ద రమాదేవి కృష్ణపట్నం పోర్టు నుండి జగ్గయ్యపేట వైపు వెళ్తున్న లారీని ఆపింది. డ్రైవర్ దిగి ఆమెతో పక్కకు వెళ్లాడు. అక్కడే వున్న మిగిలిన ముగ్గురూ అతనిపై దాడి చేసి 5వేల నగదు, ఉంగరం, వెండి బ్రాస్‌లెట్ దోచుకుని ఆటోలో పరారయ్యారు. బాధితుడైన డ్రైవర్ దీనిపై వేదాయపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సి.ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దీనిపై సీరియస్‌గా దృష్టి పెట్టాడు. సుందరయ్య కాలనీ సమీపంలో ఈ ముఠా సంచరిస్తున్నదనే సమాచారంతో నిఘా పెట్టి వారిని వలవేసి పట్టుకున్నారు. ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సి.ఐ, ఎస్.ఐ, సిబ్బందిని డిఎస్పీ అభినందించారు.

## • పాతపేపరు వేదికగా...

# నీతిమాలిన రాతలు... పనికిమాలిన వ్యాఖ్యలు


## • "కుళ్ళు" కంపు కొడుతున్న తప్పుడు వార్తలు


**జిల్లాలో తాను పెద్ద పోటుగాడినని చెప్పుకునే పాతపేపరు సంపాదకుడు మరోసారి విషం కక్కాడు. నీ గురించి రాసి మా పత్రికలో స్థలం వృధా చేసుకోలేమని ఎన్నిసార్లు చెప్తున్నా రెచ్చగొట్టే ధోరణే ధ్యేయంగా పదేపదే అదేపనిగా పిచ్చిరాతలు రాస్తున్నాడు.**


నెల్లూరు మినిబైపాస్‌రోడ్డులో నిర్మితమైన ఓ వస్త్ర దుకాణం వ్యవహారంలో స్థల యజమానులది తప్పుగా పేర్కొంటూ "రౌడీ సెటిల్‌మెంట్లు", "అమాయకులను దోచుకుంటున్నారు", "ఉసురు తగలకుండా పోతుందా" అంటూ పిచ్చి ప్రేలాపనలు పేలాడు. అసలు ఆ పాతపేపరు సంపాదకుడికి జర్నలిజం అంటే తెలుసా... లేదా పిచ్చోడి చేతికి రాయి దొరికినట్లుగా అతని చేతికి ఓ పాతపేపరు, తుప్పుపట్టిన పెన్ను దొరకడంతో నిజానిజాలు తెలుసుకోకుండానే కల్లు తాగిన కోతిలాగా ప్రవర్తిస్తున్నాడో అర్ధం కావడం లేదు. తనకిష్టం లేనోళ్ళు "రామా" అన్నా అందులో తప్పును వెతికి తన పాతపేపరులో చెత్తవార్తలు రాసే స్థాయికి దిగజారిన ఇతని మానసిక స్థితి చూస్తుంటే జాలేస్తోంది. తప్పుడు వార్తలతో, అబద్ధపు నిందలతో చేతికేదొస్తే అది రాసేస్తున్న ఇతని పైశాచిక ప్రవర్తన చూస్తే నవ్వు కూడా వస్తుంది.

### స్థలం ఎవరి దగ్గర ఎప్పుడు కొన్నారు...??

మినిబైపాస్‌రోడ్డులోని బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌లో కొత్తగా వెలసిన వస్త్ర దుకాణానికి సంబంధించిన స్థలం 2007 ఫిబ్రవరి 12వ తేదీన చింతలపూడి పెంచలయ్య, కనుపూరు భక్తవత్సలరెడ్డి, కాకర్ల వెంకటేశ్వర్లు, దేవరం బలరామిరెడ్డి, జాగర్లమూడి విద్యుల్లత అనే వారి దగ్గర నుండి శివప్రభాత్‌రెడ్డి, శ్రీమతి భారతిరెడ్డి, డాక్టర్ తాళ్ళూరు యదుకుల కృష్ణ, శ్రీమతి రోహిణిలు ఒకేరోజు కొనుగోలుచేసి డాక్యుమెంట్ నెం.2543, 2545, 2546ల ద్వారా రిజిష్టర్ చేసుకున్నారు. అప్పట్లోనే ఈ స్థలానికి ప్రభుత్వ మార్కెట్ రేటు ప్రకారం రూ.39,75,840 చెల్లించి వారు రిజిష్టర్ చేసుకున్నారు. ఆ విషయాన్ని తప్పుదోవ పట్టించి 2015 జూన్6వ తేదీన చనిపోయిన ఓ హోటల్ యజమాని(ఈ స్థలానికి ఆనుకుని వున్న స్థలానికి కూడా యజమాని) కుటుంబానికి అన్యాయం చేసి ప్రస్తుత యజమమానులు లాక్కున్నారని ఆ సంపాదకుడు అబద్ధపు రాతలు రాసేశాడు. ఇక్కడే అతని "కుళ్ళు"బుద్ధి బయటపడిపోతుంది. ఈ స్థలం కొన్నది 2007లో. అయితే 2015లో చనిపోయిన ఓ హోటల్ యజమాని కుటుంబానికి మాయమాటలు చెప్పి ఆ స్థలం కొట్టేశామంటూ తప్పుడు వార్తలు రాయడం ఆయన కుటిలబుద్ధిని బట్టబయలు చేస్తుంది. 2007లో కొన్న స్థలానికి, 2015లో చనిపోయిన వ్యక్తికి చెందిన స్థలానికి లేని సంబంధాన్ని ముడిపెట్టి అభూతకల్పనలతో దుష్ప్రచారం చేయడం ఆయన నీచరాతలకి నిదర్శనం. నిజంగా నీతితో నిజాయితీతో వార్తలు రాయాలనుకుంటే వాస్తవాలు రాయడానికి 10నిముషాలు చాలు. అసలు ఆ స్థలం ఎవరిది... ఎప్పుడు కొన్నారు...? అని ఆలోచించి రిజిష్టర్ ఆఫీసులో కనుక్కుంటే డాక్యుమెంట్‌తో సహా (మిగతా 11వ పేజీలో)








2007 ఫిబ్రవరి 12వ తారీఖున ప్రస్తుత స్థల యజమానుల పేరుతో మూడు ప్లాట్లు రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్లు (ఈ స్థలానికీ 2015లో చనిపోయిన హోటల్ యజమానికీ ఏలాంటి సంబంధం లేదని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.)

రూ.5లక్షలకే డబుల్ బెడ్‌రూం ఇల్లు
(రూ.15లక్షలు బ్యాంకు ఋణ సదుపాయం మేమే కల్పించబడును)
కావేరి గార్డెన్స్‌లో 976.75 చ॥అ॥ల G+2
డబుల్ బెడ్‌రూమ్ గ్రూప్‌హౌస్ సముదాయం
కావేరి గార్డెన్స్

త్వరపడండి...
వెంటనే బుక్ చేసుకోండి!
విపిఆర్ విల్లాస్‌కి తూర్పు వైపున, కనుపర్తిపాడు, ఎన్‌హెచ్5, నెల్లూరు.
60X40 (33.33అంకణముల) ప్లాట్లు తక్షణమే ఇల్లు కట్టుకోవడానికి రెడీగా కలవు.
కెబిఆర్ కన్‌స్ట్రక్షన్స్
గ్రౌండ్ ఫ్లోర్, కావేరి ఎస్టేట్స్, బెజవాడగోపాలరెడ్డి సర్కిల్, మినీబైపాస్‌రోడ్డు, నెల్లూరు.
సంప్రదించండి:
98490 47995

## 'ప్రభా'తం

# 'నేర' రాజకీయాలు మారాలి

**మనదేశంలో నానాటికీ భ్రష్ట రాజకీయాలు పెరిగిపోతూనే ఉండడం విచారకరం. నేరచరితులు నేరుగా చట్టసభల్లోకి వచ్చేందుకు పలు పార్టీలు తలుపులు బార్లా తెరిచే ఉంచుతున్నాయి. నేరాలు చేసేవారు.. శాసనాలు చేసేవారు ఒక్కరే అయితే ఫలితాలు ఎంత ఘోరంగా ఉంటాయో చెప్పలేం. ఇకనైనా ఈ తీరు మారాలి. నేరచరితుల్ని పూర్తిస్థాయిలో నియంత్రించడమే కాక, నేర రాజకీయాలను కూడా దూరం చేసి.. చక్కని ప్రజాస్వామ్యయుత వాతావరణం కల్పించాలి. అప్పుడే దేశం విశుద్ధ రాజకీయాలతో కళకళలాడుతుంది. అందరికీ మార్గదర్శకమవుతుంది.**

"మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ. ఈ భూ మండలంలోనే అత్యున్నతమైన గొప్ప వ్యవస్థ. మనకన్నా గొప్పవారెవరూ ఈ లోకంలో లేరు".. అనుకుంటుంటాం. అయితే ఇవన్నీ మన గొప్పలు చెప్పుకోవడానికే గానీ వాస్తవానికి ఇదంతా మేడిపండు మాత్రంగానే ఉండడం ఎంతైనా బాధాకరం. దాదాపు 90 కోట్లమందికిపైగానే ఓటర్లున్న బృహత్తరమైన మన దేశంలో ప్రజాస్వామ్యానికి సవాల్‌గా మారుతున్నది పార్టీల నాయకులే కావడం విచారకరం!.. నేరచరితులు నేరుగా చట్టసభల్లోకి వచ్చేందుకు పలు పార్టీలు తలుపులు బార్లా తెరిచి ఉంచడమే అందుకు కారణం!.. నేరాలు చేసేవారు, శాసనాలు చేసేవారు ఒక్కరే అయితే ఫలితాలు ఎంత ఘోరంగా ఉంటాయో చెప్పలేం. అయితే, నేరచరితుల్ని రాజకీయపార్టీలు దూరం పెట్టాల్సింది పోయి, అలాంటి నేరగాళ్ళనే అక్కున చేర్చుకోవడం దారుణం. పార్టీల వారి అండ దండలు చూసుకుని తామే నాయకులమంటూ పేట్రేగిపోయే నేరచరితులను అపేవారూ.. అడ్డుకునే వారెవరూ లేకపోవడం మనదేశంలో మరీ బాధాకర పరిస్థితి. పదేళ్ళ క్రితం సార్వత్రిక ఎన్నికల్లో 15 శాతం మంది నేరచరితులు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 19 శాతానికి పెరిగిందనేది ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం ఆందోళన. అంతేకాదు, 17వ లోక్‌సభ ఎన్నికల్లో నేరచరితుల సంఖ్య మరింతగా పెరిగిపోయిందంటూ ఆ సంఘం తన తాజా నివేదికలో విశ్లేషించడం గమనార్హం. అందుకు కారణమెవరు.. సంబంధిత పార్టీల నాయకులే. నేర చరితులకు పార్టీ టిక్కెట్లను కట్టబెట్టడంలో దేశంలోని రెండు ప్రధాన పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌లు ప్రధాన స్థానం అలంకరించడం మరింత సిగ్గుచేటు. 2009 ఎన్నికల్లో ఈ రెండు పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో 27 శాతం దాకా నేరచరితులు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 40 శాతం దాకా పెరగడం చూస్తే.. 'ఒంటె-గుడారం' కథలో లాగా భవిష్యత్తులో ఇక పూర్తిగా నేరచరితులదే హవా అయిపోతుందేమోనని సామాన్యుల ఆందోళన. డబ్బు దస్కమే కాకుండా రౌడీయిజంతో, నేరపూరిత మనస్తత్వంతో ఉండేవారు కూడా పార్టీల్లోకి చొరబడిపోతుంటే నియంత్రించాల్సిన పార్టీలే మిన్నకుంటే ఎవరు మాత్రం ఏమిచేయగలరు?... ఇలాంటి దుస్థితి పార్టీల్లో సర్వసాధారణ స్థితిగానే ఉంటోంది. కొద్దిగా చోటిస్తే చాలు.. మిగతాదంతా అదే వస్తుందనే ధీమాతో ఉండే నేరచరితులకు పార్టీలు తల్లొగ్గిపోతుండడం, తమ పార్టీల్లో ప్రధానంగానో, అప్రధానంగానో అలాంటివారికి స్థానం కల్పిస్తుండడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదనే విషయం అందరికీ తెలిసిందే. అందుకే, నేరపూరితమైన రాజకీయాలను ప్రక్షాళన చేయాలనే సదుద్దేశంతో సుప్రీంకోర్టు ఎన్నో కఠినమైన నియమ నిబంధనలు విధించింది. అయినా వాటన్నిటినీ నాయకులు నీరుగారుస్తుండడం ఎంత దారుణమో!.. సుప్రీం సూచనల మేరకు ఎన్నికల సంఘం ఈ విషయంపై దృష్టి సారించి, అభ్యర్థులు తమ స్వీయ నేరచరిత్ర వివరాల్ని పార్టీలకు తెలిపినట్లు రిటర్నింగ్ అధికారికి తప్పనిసరిగా వెల్లడించాలని, పత్రికలు, టీవీల ద్వారా ఆ వివరాలను ఓటర్లకు కూడా తెలపాలని ఖచ్చితమైన ఆదేశాలున్నా.. ఆచరణలోకి వచ్చేసరికి మీ దారి మీదే.. మా దారి మాదే అన్నట్లుగా నేరచరిత్రులు పార్టీల్లోకి ఎడాపెడా దూసుకొచ్చేస్తున్నారంటే పార్టీలవారు నేరచరిత్రులను అక్కున చేర్చుకోవడంలో ఎంత ఆసక్తిని ప్రదర్శిస్తున్నారో తేటతెల్లమవుతోంది. నీతి నియమాలకు నీళ్లొదిలేసి, నిబంధనలకు ఎక్కడో ఒక చోట చిల్లులు పెట్టి పార్టీల్లోకి దూరివచ్చే నేరచరితులను ఆపలేకపోతుండడం, పైపెచ్చు అలాంటివారే తమ పార్టీ అమాంతం నెగ్గకురావడానికి పనికివస్తారనే అభిప్రాయానికి రావడం కంటే ఘోరమైన విషయం మరొకటి ఉండదు. అసలు రాజకీయపక్షాలు.. నేరగాళ్ళను ఎన్నికల్లో నిలబెట్టకుండా ఉంటే ఇలాంటి సమస్యే ఉండదని విజ్ఞులు చెప్తున్నా వినేవారెవరు?.. పార్టీల్లో నేరచరితుల్ని చేర్చుకోవడం మంచిది కాదనే విషయం రాజకీయనాయకులకు తెలియని కొత్త విషయమేమీ కాదు. అయినా.. ఇప్పుడా మంచికాలం ఎప్పుడో చెల్లిపోయింది. రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టిపోయాయి. అభ్యర్థి ఎవరనైతేనేం మన పార్టీ గెలిస్తే చాలు అనే వింతపోకడ పార్టీలదైతే, పార్టీ ఏదైతేనేం.. తమను చేరదీస్తే చాలు..అదే పదివేలు అనుకునే నేర చరితులకు కొదవే ఉండడం లేదు. చల్లగా పార్టీల నీడన హాయిగా సేదదీరే నేరచరితుల్ని ఇక ఎవరు నియంత్రించగలరు?... ఆయా పార్టీలవారు స్వయంగా పార్టీల్లోకి వారిని స్వాగతిస్తుండడం ప్రజాస్వామ్య వ్యవస్థకే చక్కగా చిల్లులు పెట్టడం కాదా?.. వంటి ప్రశ్నలన్నీ మనం గాల్లో వేసుకోవాల్సిందే తప్ప జవాబులు మాత్రం దొరకవు. నేరారోపణలు సత్వరమే పరిష్కారానికి నోచుకోక ఏళ్ళతరబడి కాలయాపన జరుగుతుండడం కూడా నేరచరితులకు మరో సానుకూల అవకాశంగా అమరుతోందన్న అభిప్రాయాలను కూడా కాదనలేం. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చే చట్ట సభల్లో ఎందరు నేరచరితులు కొలువుదీరుతారో అనూహ్యమే మరి!.. నాయకులపై నేరారోపణలకు సంబంధించి ప్రాథమిక సాక్ష్యాధారాలు లభిస్తే ఎన్నికల్లో పోటీకి అనర్హులను చేయడం, అదే సందర్భంలో ఎవరైనా తప్పుడు నేరారోపణలు చేస్తే వారిని కఠినంగా శిక్షించడం వంటి ఖచ్చితమైన నిర్ణయాలను చిత్తశుద్ధితో అమలుచేసినప్పుడే ఇలాంటి దుర్గతుల నుంచి ప్రజాస్వామ్యానికి విముక్తి. ఆ మంచి కాలం మళ్ళీ ఎప్పుడొస్తుందో ఏమో!.. అయినా, ఈ భ్రష్ట రాజకీయాలు అంత త్వరగా మారుతాయని అనుకోలేం!.. ఎన్ని సంస్కరణలు వచ్చినా, సుప్రీంకోర్టు ఎంతగా కొరడా ఝుళిపించినా, ఎంతమంది విజ్ఞులు-అనుభవజ్ఞులు ఎన్ని రకాలుగా చెప్పి చూసినా లెక్కచేయని పెడసరం రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. అలాంటి వితండ రాజకీయాలకు నాయకత్వం వహించే నాయకగణం తీరువల్లనే.. ఎంతో గొప్పదైన మన ప్రజాస్వామ్యం.. అప్రదిష్ట పాలవుతోంది.

నేరచరితుల్ని పూర్తిస్థాయిలో నియంత్రించడమే కాక, నేర రాజకీయాలను కూడా దూరం చేసి.. చక్కని ప్రజాస్వామ్యయుత వాతావరణం కల్పించినప్పుడే దేశం కళకళలాడుతుంది. ఇకనైనా పార్టీల వారు తమ ధోరణి మార్చుకుని తమ పార్టీల్లో మంచివారికి చోటిచ్చి అందరికీ మార్గదర్శకం కావాలి. అప్పుడే మన ప్రజాస్వామ్యం ఠీవిగా మనగలుగుతుంది.

---

# నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధి మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న పరిమళ కొరాయి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. సింహపురి గోవిందమాల కమిటీ, కనకదుర్గా సేవా సమితి, కొలపర్తి రమేష్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు విశేష తిరుమంజనం, పంచామృతాభిషేకాలు జరిపించారు. అనంతరం సహస్రనామ పూజలు, విశేష అలంకారం చేశారు. పుష్పాలతో అందంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో, మంగళవాయిద్యాలతో, భక్తుల గోవిందనామస్మరణలతో వైభవంగా జరిగింది. అనంతరం పుష్పయాగం, స్వామివార్లకు ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయ ఇఒ జి.రామకృష్ణ, పప్పులవీధి మిత్రమండలి, మహాలక్ష్మీ మహిళా మండలి సభ్యులు పర్యవేక్షించారు.

---

### ● టిటిడి 'శుభప్రదం'

# వేసవి శిక్షణకు దరఖాస్తులు పంపండి

తిరుమల తిరుపతి దేవస్థానాల వారు 'శుభప్రదం' పేరుతో తిరుపతిలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతులకు విద్యార్థినీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎన్.దేవరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో ఈ నెల 27 నుంచి జూన్ 2వ తేది వరకు 7,8,9 తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారని, ఈ తరగతుల్లో పాల్గొనే విద్యార్థులకు ఉచితంగా ప్రవేశం, వసతి, భోజన సౌకర్యాలుంటాయని, విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా తరగతులు నిర్వహిస్తారని, శిక్షణ పూర్తిచేసుకున్నవారికి ప్రశంసాపత్రాలు బహూకరిస్తారని వివరించారు. అంతేకాక, ఈ తరగతుల్లో పాల్గొనే విద్యార్థులకు ప్రయాణఖర్చుల కోసం 400 రూపాయల నగదును అందజేస్తారని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 20వతేదీలోగా నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో ఉన్న టిటిడి కల్యాణమండపం ప్రాంగణంలోని ధర్మప్రచార పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. వివరాలకు 9440932417 నంబర్‌ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

---

### 104 సేవలను

# ప్రభుత్వమే నిర్వహించాలి

గ్రామాల్లోని ప్రజలకు ఇంటివద్దే వైద్యసేవ లందిస్తున్న 104 సేవలను ప్రైవేట్‌పరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహించాలని 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు సతీష్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. గతంలో రాష్ట్రప్రభుత్వం ఈ సేవలను నిర్వహించినప్పుడు ఒక్కో వాహనానికి 1.04 లక్షల రూపాయలను వెచ్చించేదని, అయితే ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించిన తర్వాత దాదాపు 3లక్షల రూపాయలు వెచ్చించాల్సివస్తోందని, ఇందువల్ల ప్రజాధనం దుర్వినియోగమవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్మిక చట్టాలను సక్రమంగా అమలుచేయకపోవడంతో సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని కూడా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

---

# నీటి పొదుపుపై చైతన్యం

ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడ్డ తీవ్ర కరువు పరిస్థితులను చూస్తున్నాం. చాలా ప్రాంతాలలో తాగడానికి నీళ్ళు దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. గాలి, నీరు ప్రకృతి మనకు ఉచితంగా అందించే ప్రాణాధార వస్తువులు. ఈ రెండింటిని ఇప్పుడు కొనుక్కునే దుస్థితి వచ్చింది. జనాభా పెరుగుదల వల్లయితేనేమీ, ఇతర కారణాల కారణంగా నీటి వినియోగం పెరిగిపోయింది. అదే సమయంలో వర్షాలు తగ్గిపోతున్నాయి. నీటి పొదుపుపై ప్రజల్లో చైతన్యం లేదు. ఇళ్లల్లో నీళ్ళు ఎలాగంటే అలా వాడేస్తున్నారు. నీటి పొదుపుపై తక్షణం అవగాహన వచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాల్సి వుంది.

**జొన్నా రామ్మోహన్, నెల్లూరు.**

### సీఎంగా పనికిరానోడు...

# పీఎంగా పనికొస్తాడా?

ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి పెట్టాడు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పతనం అంచుల్లోకి తీసుకెళ్ళాడు. పదిమందికి పని చూపించే దిశగా ఈ ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట లేదు. కేవలం దుబారా మాత్రమే జరిగింది. వేల కోట్లు దుర్వినియోగం జరిగింది. రాష్ట్రాన్ని ఇంతగా అస్తవ్యస్తం చేసిన చంద్రబాబునాయుడును ఓ మీడియా సంస్థ భవిష్యత్ ప్రధానిగా ప్రమోట్ చేస్తోంది. రేపు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో గెలవడమే కష్టం. సీఎంగా పనికిరాని నాయకుడు పీఎంగా పనికొస్తాడా?

**వాసుపల్లి నరేష్, రాజంపేట.**

# తగిన శాస్తి జరిగింది

హిందూ సంస్కృతిపై అదే పనిగా విషం కక్కి ధర్మాన్ని కించపరిచిన టివి9 సిఇఒ రవిప్రకాశ్‌కు తగిన శాస్తి జరిగింది. ఏ టి.వి.9ను చూసుకుని ఆయన మిడిసిపడ్డాడో అదే టీవీ9 నుండి గెంటేయబడ్డాడు. జీవితంలో ఎంతోమంది మీద దుష్ప్రచారం చేసి వారిని మానసికంగా ఇబ్బందిపెట్టాడు. ఇప్పుడు ఇతర ఛానల్స్‌లో తనను ఫోర్జరీ కేసులో 420గా ప్రచారం చేస్తూ వార్తలు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. ప్రజల మనోభావాలతో ఆడుకున్న రవిప్రకాశ్ తగిన మూల్యం చెల్లించాడు. పాములు పట్టేవాడు పాము కాటుకే మరణిస్తాడన్నట్లు మీడియా ద్వారా పెరిగిన రవిప్రకాశ్ ప్రతిష్ఠ కూడా అదే మీడియా ద్వారా మంటగలిసింది.

**– సి.రాజీవ్, నెల్లూరు.**



# అదిగో... ఇక 5 రోజులే..!



*సరిగ్గా ఇక ఐదు రోజులే... 43రోజుల నిరీక్షణలో ప్రజలు నెలరోజులు దాటారు. ఇంకో ఐదు రోజులలో ఎన్నికల ఫలితాల ముందుకు రాబోతున్నారు. సరిగ్గా వచ్చేవారం ఈసరికల్లా కేంద్రంలో ప్రభుత్వమెవరిది, రాష్ట్రం చంద్రబాబుదా? జగన్‌దా? జిల్లాలో ఏ సీట్లలో ఎవరు గెలిచారు అన్నది తేలిపోనుంది.*




**కౌంటింగ్ బూత్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు**

ఎన్నికల తేదీకి ఎన్నికల ఫలితాల తేదీకి ఈసారి సుదీర్ఘకాలం గ్యాప్ వచ్చింది. దీంతో నాయకులలోనూ, కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ఉత్కంఠత పెరిగింది. నెలరోజులుగా ఎక్కడ పట్టినా రాజకీయ చర్చలే! ఏ నియోజకవర్గంలో ఎవరు గెలవబోతున్నారనే లెక్కలే... మండలాలు, గ్రామాల్లో అయితే ఈ వేడి ఎక్కువుగా వుంది. పల్లెల్లో అయితే బూత్‌ల వారీగా కూడా లెక్కలు వేస్తున్నారు. ఇక గెలుపోటముల మీద పందేలంటే సరేసరి. అయితే 2014లో కాసినంతగా ఈసారి పందేలు కాయడం లేదు. 2014లో ఇరు పార్టీల వారిలోనూ గెలుపుపై ధీమా వుండింది. కాబట్టి అప్పుడు పందేలు తారాస్థాయిలో జరిగాయి. అదీగాక పోలింగ్‌కు కౌంటింగ్‌కు పెద్ద గ్యాప్ లేకపోవడంతో పూర్తి స్థాయిలో విశ్లేషణలు రాలేదు. అందుకే పందేలు ఎక్కువగా జరిగాయి. కాని, ఈసారి 43రోజులు గ్యాప్ రావడంతో ఎన్నికల సరళిపై లోతుగా విశ్లేషణ జరిగింది. గెలుపోటములపై దాదాపు ఒక క్లారిటీ వచ్చింది. దాంతో పార్టీల గెలుపోటముల మీద పెద్దగా పందేలు జరగడం లేదు. కేవలం గట్టిపోటీ వుందనుకున్న నియోజకవర్గాల మీద, అలాగే ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే అంశం మీద మాత్రమే ఎక్కువుగా పందేలు జరుగుతున్నాయి.

## కౌంటింగ్‌కు సిద్ధమైన అభ్యర్థులు...

ఎన్నికల బరిలో వున్న అభ్యర్థులు ఈ నెల 23వ తేదీన కౌంటింగ్‌కు సిద్ధమయ్యారు. ఈమేరకు అనుభవం వున్న వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా పెట్టుకుంటున్నారు. అందరి కంటే ఎక్కువ టెన్షన్ అనుభవిస్తున్నది అభ్యర్థులే! ఈవిఎంలను లెక్కపెట్టి పక్కనేసేస్తే అభ్యర్థులు టెన్షన్ నుండి బయటపడతారు. గెలిచినోళ్ళు విజయోత్సవాలు జరుపుకుంటారు. ఓడినోళ్ళు ఒకరోజు ఏడ్చి సరిపెట్టుకుంటారు. టెన్షన్ అక్కడికి ముగిసిపోతుంది.

## అధికారులు సన్నద్ధం...


కౌంటింగ్ ప్రక్రియను సజావుగా ముగించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. నెల్లూరులోని డికెడబ్ల్యూ కళాశాలలో నెల్లూరు లోక్‌సభ, దాని పరిధిలోని ఏడు శాసనసభ స్థానాల కౌంటింగ్, అలాగే కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో తిరుపతి లోక్‌సభ, దాని పరిధిలోని ఏడు శాసనసభ స్థానాల కౌంటింగ్ జరుగనుంది. చిత్తూరు జిల్లాకు సంబంధించి మూడు, ప్రకాశం జిల్లాకు సంబంధించి ఒక అసెంబ్లీల కౌంటింగ్ కూడా నెల్లూరులోనే జరుగుతుండడం వల్ల ఆ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా నెల్లూరుకు రావచ్చు. రెండు కౌంటింగ్ కేంద్రాల వద్ద కూడా భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో కౌంటింగ్ గదిని ఏర్పాటు చేయనున్నారు. పోలైన ఓట్లను బట్టి రౌండ్లను నిర్ణయిస్తారు. ఒక్కో రౌండ్‌లో 14ఈవిఎంల వరకు లెక్కపెట్టే అవకాశముంది. ఈవిఎంల లెక్కింపు తర్వాత నియోజకవర్గానికి ఐదు చొప్పున లాటరీ ద్వారా వివి ప్యాట్‌లను ఎంపిక చేసి లెక్కిస్తారు. వివిప్యాట్‌లు లెక్కించాక వచ్చిన ఫలితాలకు దానికి సంబంధించిన ఈవిఎంలలో వచ్చిన ఫలితాలకు సరిపోతే తుది ఫలితం ప్రకటిస్తారు.

ఏదేమైనా గత 38రోజులు ప్రజలకు చాలా భారంగా గడిచాయి. రోజొక యుగంగా గడిచింది. ఇక గట్టిగా 5రోజులే! కళ్లుమూసుకుని తెరిస్తే 23వతేదీ కళ్ళ ముందుంటుంది.

# పూర్తి చేస్తే... మెట్టకు కొండంత అండ.. వెలుగొండ



*నెల్లూరుజిల్లాలో ప్రతి ఏటా ఎండాకాలంలో గుక్కెడు నీళ్ళకు అలమటించే ప్రాంతం ఏదన్నా వుందంటే అది ఉదయగిరి ప్రాంతం. పూర్తిగా మెట్ట నేల. వర్షాభావ పరిస్థితులు ఎక్కువ. నీటి వసతి తక్కువ. సోమశిల రిజర్వాయర్ నుండి 250కిలోమీటర్ల దూరంలో వుండే చెన్నైకు నీళ్ళు వెళుతుంటాయి, 25కిలోమీటర్ల దూరంలో వుండే ఉదయగిరికి సోమశిల నీళ్లెక్కవు. అంత దరిద్రం ఇక్కడ. జిల్లాలోని మిగిలిన 9అసెంబ్లీ నియోజకవర్గాల వాళ్ళకు పెన్న నీళ్ళు అందుతాయి. ఉదయగిరికి మాత్రం పెన్న నీళ్ళు తాగే అదృష్టం లేదు. అంత ఎత్తైన ప్రాంతం కూడా అది!*



జిల్లాలో పురాతన ఇళ్ళు, బొంత రాళ్ళతో కట్టిన మొండి గోడలను ఒక్క ఉదయగిరి పల్లెల్లోనే చూడగలం. ఇక్కడ కరువు సాధారణం. తిరునాళ్ళకు చుట్టాలు ఇంటికి వచ్చినట్లు ప్రతి ఏటా కరువొచ్చి ఈ ప్రాంత ప్రజలను పలకరించి పోవడం సాంప్రదాయం. ఈ నియోజకవర్గ పరిధిలోని ఉదయగిరి, సీతారాంపురం, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు, కొండాపురం మండలాలలో ఏడాదిలో ఆరు నెలలు మాత్రమే పనులుంటాయి. మిగతా ఆరు నెలలు జనం ఖాళీనే! అందుకే పనుల కోసం వెతుక్కుంటూ ఈ ప్రాంతవాసులు దేశ విదేశాలకు వలస పోతుంటారు. ఇలా వలస వచ్చినవాళ్ళే ఒక్క నెల్లూరు నగరంలోనే ఈ ప్రాంతానికి సంబంధించిన వాళ్ళు 50వేల మందికి పైగా వుంటారనడంలో ఆశ్చర్యం లేదు. ఉదయగిరి నియోజకవర్గంలో ఇప్పుడున్న జనాభాకంటే ఈ ప్రాంతం నుండి వలస వెళ్ళి బయట ప్రాంతాలలో స్థిరపడిన వాళ్ళే ఎక్కువుగా వుంటారు. ప్రపంచంలో ఏమూలకు వెళ్లినా మలయాళీలు వుంటారనే ప్రచారమొకటుంది. అలాగే ప్రపం చంలో ఏ మూలకు వెళ్లినా తెలుగోళ్ళు, అందులోనూ ఉదయగిరోళ్ళు వుంటుంటారు. బ్రతుకు బాట కోసం వలస బాట పట్టిన వాళ్ళంతా కూడా ఇలా వివిధ ప్రాంతాలలో స్థిరపడివున్నారు. ఉదయగిరి ప్రాంతంలోని గ్రామాలలో చాలా తీవ్రమైన కరువుంది. ఈ నియోజకవర్గంలోనే పెద్ద పట్టణం వింజమూరు. ఈ పట్టణంలో దాదాపు ఏడాది కాలంగా ప్రతి ఇంటికి ట్యాంకర్ల ద్వారా నీటిని సప్లయ్ చేస్తున్నారంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగావుందో, వర్షాలు లేక పరిస్థితులు ఎంత దారుణంగా వున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నీళ్ళుండాలి. నీళ్ళుంటేనే వ్యవసాయ రంగంతో పాటు ఇతర రంగాలైనా అభివృద్ధి చెందుతాయి. ఉదయగిరి ప్రాంతానికి నీటి వసతి చాలా తక్కువ. ప్రతిఏటా వర్షాలు అంతంత మాత్రం. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి ఈ ప్రాంతానికి నీరందించాలనే ఉద్దేశ్యంతో సోమశిల హైలెవల్ కెనాల్‌ను మంజూరు చేయించాడు. దానికి సంబంధించిన పనులు పురోగతిలో వున్నాయి.

అయితే ఉదయగిరి ప్రాంత కరువుకు శాశ్వత పరిష్కారం వెలుగొండ ప్రాజెక్ట్. ఇది పూర్తయితేనే ఈ ప్రాంతానికి నీళ్ళందుతాయి. బీళ్ళు చేలవుతాయి. తాగునీటి సమస్య తీరుతుంది. దాదాపు 3దశాబ్దాలుగా ఈ ప్రాంతవాసులు వెలుగొండ కోసం ఎదురుచూస్తున్నారు. నాయకులు వస్తున్నారు, పోతున్నారు. వెలుగొండపై పెద్దఎత్తున హామీలిస్తున్నారు. కాని, ఇది వేగంగా ముందుకు సాగడం లేదు. రేపు ఏర్పడబోయే ప్రభుత్వ కాలంలోనైనా వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ఉదయగిరికి వున్న కరువు సెంటిమెంట్‌ను శాశ్వతంగా తుడిపేయాల్సివుంది. వెలుగొండ సాధనతోనే ఈ ప్రాంత రూపురేఖలు మారగలవు.



## • పదిలో..
# మెరిసిన 'రత్నం'



అభినందన కార్యక్రమంలో విజయచిహ్నం చూపుతున్న విద్యాసంస్థల ఎం.డి కె.వేణుగోపాల్, పక్కన జిఎం రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్

ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాలలో రత్నం విద్యాసంస్థలు మంచి ఫలితాలతో తమ జైత్రయాత్రను కొనసాగించాయి. ఈ విద్యాసంస్థల నుండి 163 మంది విద్యార్థులు పదికి పది జిపిఏ సాధించారు. 268 మంది 9.8 జిపిఏకుపైన, 384 మంది 9.7 జిపిఏకు పైన, 486మంది 9.5 జిపిఏకుపైన, 577 మంది 9.3 జిపిఏకు పైన, 690 మంది 9.2 జిపిఏకుపైన, 788 మంది 9 జిపిఏకు పైన సాధించారు. 98శాతం ఉత్తీర్ణతతో ఈ విద్యాసంస్థ అగ్రభాగాన నిలిచింది. సబ్జెక్టుల వారీగా చూస్తే తెలుగులో 616మంది, హిందీలో 445 మంది, ఇంగ్లీష్‌లో 728 మంది, గణితంలో 464మంది సైన్స్‌లో 378మంది, సోషల్‌లో 474మంది 10కి 10 జిపిఏ సాధించారు. ఈ సందర్భంగా 14వ తేదీ నెల్లూరు, హరనాథపురంలోని రత్నం మెడికల్ అకాడమీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఈ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యా బోధన, క్రమశిక్షణ, విద్యార్థుల కృషి ఫలితంగానే ఈ ఫలితాలు సాధించామన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వంద శాతం ఫలితాలతో మైథిలి



విజేతలతో మైథిలి మనోహర్‌రెడ్డి

ప్రతి ఏటా పదో తరగతి ఫలితాలలో నూరు శాతం ఫలితాలు సాధించే నెల్లూరు, వేదాయపాలెం చంద్రమౌళీనగర్‌లోని మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఈ ఏడాది కూడా ఆ సాంప్రదాయాన్ని నిలబెట్టుకుంది. ఈ స్కూల్ నుండి 38మంది విద్యార్థులు పది పరీక్షలు వ్రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. 10జిపిఏను నలుగురు, 9.8 జిపిఏను ఏడుగురు, 9.0కి పైగా జిపిఏను 23మంది సాధించారు. ఇంతటి మంచి ఫలితాలు సాధించడానికి కారణమైన ఉపాధ్యాయ సిబ్బందిని, అలాగే విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి అభినందించారు.

# వేదవ్యాస ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ ఏ.పి.బాలాజీ

పదవ తరగతి ఫలితాల్లో తమ స్కూలు విద్యార్థులు అయిదుగురు 10కి10 జిపిఏ సాధించారని వేదవ్యాస స్కూల్ కరస్పాండెంట్ ఏ.పి. బాలాజీ తెలియజేశారు. ఏ.సాకేత్‌సాయి, ఎస్‌కె అబ్దుల్ వాహీద్, పి.బిందుభవాని, ఎస్‌కె ముస్కాన్, సిహెచ్.శ్వేతలు ఈ ఘనవిజయం సాధించారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మరో 14మంది విద్యార్థులు 9 పాయింట్లకుపైగా జిపిఏ సాధించారని, మొత్తం 30 మంది విద్యార్థుల్లో 24మంది ఏ1, ఏ2 గ్రేడ్‌లు సాధించారని పేర్కొంటూ ఆ విద్యార్థులందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు.

# రంగడి ఆలయంలో ఆర్జిత కళ్యాణాలు



ఆర్జిత కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఇ.ఓ వేమూరి గోపి దంపతులు

నెల్లూరు రంగనాయకులపేటలో ఉత్తర శ్రీరంగంగా కీర్తింపబడుతున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 13న ఆర్జిత కళ్యాణాలను ఆలయ ఇఒ. వేమూరి గోపి, ఆలయ ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, ధర్మకర్తలు ప్రారంభించారు. ఎవరైనా భక్తులు శ్రీ రంగనాథ కల్యాణం చేయించదలచుకుంటే ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఇఓ తెలిపారు. స్వామి భక్తులు తమ జన్మదినం, వివాహ దినోత్సవం, షష్టిపూర్తి ఉత్సవాల సందర్భంగా శ్రీవారి కళ్యాణాలు చేసుకోవచ్చని తెలిపారు. 13న జరిగిన రంగనాథుడి కల్యాణం కనులపండువగా జరిగింది. ఈ కల్యాణానికి ఉభయకర్తలుగా ఇఓ వేమూరి గోపి దంపతులు వ్యవహరించారు. భక్తులు ఆర్జిత కల్యాణ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిషింద సుదర్శనాచార్యులు, రాము స్వామి పాల్గొన్నారు.

# విజయదుర్గకు ఏషియన్ ఎక్సలెన్స్ అవార్డు



ఏషియన్ ఎక్సలెన్స్ అవార్డునందుకుంటున్న ములుగు విజయదుర్గ

నెల్లూరు వనంతోపుకు చెందిన ప్రముఖ రచయిత్రి ములుగు విజయదుర్గ (వినీల)కు ఇటీవల తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సిటిజన్ వెల్ఫేర్ ఫోరం సంస్థ ఏషియన్ ఎక్సలెన్స్ పురస్కారాన్ని అందజేసింది. సమాజం హితం కోసం, చైతన్యానికి మార్పుకు, మంచిని, మమతలను పెంచే విశాల భావాలను, వ్యక్తిత్వపు వికాసాన్ని పురోగమనంలో మనిషి స్వచ్ఛమైన నైతిక విలువలతో కూడిన ఉత్తమ సమాజ రూపకల్పనకు ప్రభోదించే వేల కవితలు రాస్తున్న విజయదుర్గకు మరో పురస్కారం వరించింది. వివిధ రంగాలలో విశేష కృషి చేసే వారికి అందించే అవార్డుకు సాహిత్య రంగంలో ఆమె ఎంపికయ్యారు. సిటిజన్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కృష్ణాభట్, కోల వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు విజయదుర్గను శాలువతో, పూలమాలలతో, మెమెంటో, గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత విజయదుర్గ మాట్లాడుతూ ఈ అవార్డు తనకు స్ఫూర్తినిచ్చిందని, సమాజసేవకు, సాహిత్య ప్రక్రియలను దశదిశల వ్యాపించేలా నూతన కవితలతో సమాజంలో మరింత ఒరవడి సృష్టించేందుకు కృషి చేస్తానన్నారు.

# క్రీడా దుస్తులు పంపిణీ చేసిన ఫ్రెండ్స్ వాకర్స్



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన ఫ్రెండ్స్ వాకర్స్ సభ్యులు

నెల్లూరులోని ఏసి స్టేడియంలో బాస్కెట్‌బాల్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఈ నెల 13న స్థానిక ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. అంతర్జాతీయ వాకర్స్ సంస్థ ప్రతినిధులు 203 జిల్లా గవర్నర్ ఎస్‌కె లాల్ వజీర్, 2వ వైస్‌ప్రెసిడెంట్ ఆలమూరి అమర్‌నాథ్, ఏరియా కార్యదర్శి ఎం.ప్రభాకర్‌రావు, శ్రీనివాసులురెడ్డి తదితరులు వాకర్స్ క్లబ్ పరిశీలనకు విచ్చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించి, ముఖ్యఅతిథుల చేతుల మీదుగా క్రీడాదుస్తులు పంపిణీచేయించారు. వీరివెంట ఎం.వి సుబ్బారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి ఉన్నారు. తొలుత అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నలుబోలు బలరామయ్యనాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక సభ్యులు తదితరులు వారిని ఘనంగా స్వాగతించారు. అసోసియేషన్ కార్యక్రమాల వివరాలను నిర్వాహకులు వివరించారు. అసోసియేషన్ కోశాధికారి కొండూరు సుబ్బారావు, కార్యనిర్వాహక సభ్యులు ఎన్.సాయిసుబ్బారావు, పిచ్చయ్య, చెంచయ్యనాయుడు, ఉపాధ్యక్షులు జి.వి కృష్ణయ్య, డి.జయరామయ్యనాయుడు, జాలీవాకర్ ఐ.సోను, వీరిశెట్టి హజరత్‌బాబు, వి.గురవయ్య, మహిళావాకర్స్ సభ్యులు ఆదిలక్ష్మి, బుజ్జమ్మ, ప్రమీల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరికీ చల్లని మజ్జిగ పంపిణీ చేశారు.

## నెల్లూరు కబుర్లు

# పరువు పోయింది

ఈ నెల 14వ తేదీన విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాలలో నెల్లూరుజిల్లా రాష్ట్రంలోనే అట్టడుగు (13వ స్థానం)న నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 33903 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 28,205మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 83.19గా నమోదైంది. గత ఏడాది కూడా నెల్లూరుజిల్లా 13వ స్థానంలోనే నిలిచింది. కాకపోతే గత ఏడాది కంటే ఈ ఏడాది 2.82 శాతం ఉత్తీర్ణత పెరగడం కొంత ఊరటగా చెప్పుకోవచ్చు. జిల్లాలో గత ఏడాది 1001మంది విద్యార్థులు పదికిపది జి.పి.ఏ సాధించగా, ఈ ఏడాది 1271మంది పది జిపిఏ సాధించారు. గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 40మంది పది జిపిఏ సాధించగా, ఈ ఏడాది 79మంది పది జిపిఏ సాధించడం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన కొంతవరకు మెరుగుపడిందనడానికి నిదర్శనం.

# పోలీసు కుటుంబానికి చేయూత



హసీనాబీకి చెక్కును అందజేస్తున్న ఏఎస్పీ పరమేశ్వరరెడ్డి

విధి నిర్వహణలో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కె సైదావలి కుటుంబానికి జిల్లా ఏఎస్పీ పరమేశ్వర రెడ్డి 14వ తేదీన 4లక్షల రూపాయల భద్రత పరిహారం చెక్కును అందజేశారు. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సైదావలి ఇటీవల ఆరోగ్యం బాగాలేక మరణించగా, ఆయన భార్య హసీనాబీకి ఏఎస్పీ ఈ చెక్కును అందజేయడం జరిగింది.

# వాయిదాపడ్డ జడ్పీ సమావేశం

ఈ నెల 14వ తేదీన నిర్వహించాలనుకున్న జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. జిల్లాలో నెలకొన్న కరువు, సాగునీటి కొరత పరిస్థితులపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 10.30గంటలకు అధికారులు నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశ మందిరంకు చేరుకున్నారు. అయితే సమావేశానికి అధ్యక్షత వహించాల్సిన ఛైర్మన్ రాలేదు. 46మంది జడ్పీటీసీలలో కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో జడ్పీ సిఇఓ సుధాకర్‌రెడ్డి మధ్యాహ్నం 12గంటల దాకా ఎదురుచూసి కోరం లేక వాయిదా వేశారు.

## ప్రభుత్వాసుపత్రిలో...
# అద్దె గదులు కావాలి

నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న రోగులకు అద్దెకిచ్చే గదులను అందుబాటులోకి తేవాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చాట్ల నరశింహారావు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. ఈనెల 13న ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ నెలాఖరులో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరుగుతుందని అద్దె గదులు అందుబాటులోకి తెచ్చే విషయాన్ని ఈ సమావేశంలో చర్చించేలా అంశాలను పొందుపరచాలన్నారు. 750 పడకలు ఉన్న కొత్త ఓపీ విభాగం, గ్రౌండ్‌ఫ్లోర్‌లో వున్న ఈఎన్‌టీ విభాగం, ఫస్ట్ ఫ్లోర్‌లో వున్న ఐసీయూ, జనరల్ వార్డ్ విభాగాలను, కొత్త ఆపరేషన్ థియేటర్‌ను ఆయన పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మస్తాన్ బాషా, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బీబీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పంచాయితీగానే పొట్టేపాళెం

***అది ఒక గ్రామం. 2014కు ముందు నెల్లూరు నగరపాలక సంస్థ 38వ డివిజన్ పరిధిలోకి చేరింది. కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలు కూడా జరిగాయి. మళ్లీ ఇప్పుడు పంచాయితీగా మారబోతోంది. ఆ గ్రామమే... నెల్లూరురూరల్ మండలంలోని పొట్టేపాళెం.***

2013 మార్చి 25వ తేదీన తమ ఊరిని కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దంటూ అప్పటి గ్రామ పంచాయితీలో తీర్మాణం చేశారు. అయితే కార్పొరేషన్‌లో విలీనం చేయ దంతో దీనిని వ్యతిరేకిస్తూ ఆనాటి పంచాయితీ పాలకవర్గం హైకోర్టును ఆశ్రయించింది. అయితే అప్పటి సర్పంచ్‌గా వున్న కోటేశ్వరరావు సహకారంతో విలీనం చేశారు. కాని, హైకోర్టులో మాత్రం ఆ కేసు అలాగే కొనసాగింది. కాగా, తాజాగా ఈ కేసు హైకోర్టులో విచారణకు రావడం, న్యాయమూర్తులు పిటీషనర్ల అభిప్రాయంతో ఏకీభవించ దంతో పొట్టేపాళెం మళ్లీ పంచాయితీగానే మార్పు చెందబోతోంది. ఈమేరకు హైకోర్టు తీర్పు కూడా వెలువరించి కార్పొరేషన్ కమిషనర్ అలీం బాషాకు ఈ ప్రతులు పంపింది.

# ఇంకెన్ని ప్రాణాలు పోవాలి?


## - సర్వీస్ రోడ్డుపై ఎన్‌హెచ్ అధికారులతో కోటంరెడ్డి



నెల్లూరులోని అయ్యప్పగుడి సెంటర్ వద్ద జాతీయరహదారిని ఆనుకునివున్న బుజబుజనెల్లూరుకు వెళ్లే సర్వీస్‌రోడ్డులో తారురోడ్డు వేయాలని కోరుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 13న నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దాదాపు 30 ఏళ్ళ నుంచి ఈ సమస్య పరిష్కారం కావడం లేదని, సుమారు 20వేల మందిదాకా జనాభా ఉన్న బుజబుజనెల్లూరుకు సరైన రోడ్డు లేకుండా ప్రజలు ఇంకా ఎంతకాలం ఇబ్బందులు పడాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలికాలంలో ఈ మార్గంలో ప్రయాణీకులు ఎక్కువగా వెళ్తున్నారని, దారిలో పెద్దపెద్ద గుంతలు ఉండడంతో ప్రజలు, ప్రయాణీకులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని, రాత్రివేళల్లోనైతే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఈ రోడ్డుపై ప్రయాణం చేయాల్సివస్తోందని ఆయన విన్నవించుకున్నాడు. అందుకు స్పందించిన అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, సమస్యను రెండురోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## నిఘా పెంచడంతో..


# నేరాలు తగ్గాయి



### - జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి

పోలీస్ గస్తీని ముమ్మరం చేయడం, నేరస్తుల కదలికలపై నిఘాను పెంచడం, నిరంతర తనిఖీలు, జిల్లావ్యాప్తంగా సిసి కెమెరాలు ఏర్పాటుచేయడం వంటి చర్యలతో జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఈనెల 11న ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. గత ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 24 హత్యలు, 428 చోరీలు, మహిళలపై 321 నేరాలు జరిగితే, ఈ ఏడాది 15 హత్యలు, 267 చోరీలు, మహిళలపై 321 నేరాలు జరిగాయని, గత ఏడాదితో పోలిస్తే నేరాలు తగ్గుముఖం పట్టాయని వివరించాడు. నేరాలు నియంత్రించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నాడు. పేకాట, సింగిల్ నంబర్లు, కోళ్ళపందాలు, గుట్కా, మద్యం అనధికార విక్రయాలు వగైరాలపై కూడా దృష్టి సారించామన్నాడు. 11మంది గుట్కా విక్రేతలను, అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న మరో 350 మందిని అరెస్ట్ చేశామన్నారు. పేకాట కేసులకు సంబంధించి 154 మందిని, కోడిపందాల కేసులకు సంబంధించి 15మందిని, సింగిల్ నంబర్ ఆటగాళ్ళు అయిదుగురిని అరెస్ట్ చేశామని ఎస్పీ వివరించాడు. నేరాల నియంత్రణతో పాటు మరోవైపు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎంతగానో కృషి చేస్తున్నారని పోలీసు సిబ్బంది సేవలను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించాడు.

# ఐస్‌క్రీములా...? క్రిములా??



- **నాసిరకంగా తయారీ**
- **విజిలెన్స్ తనిఖీల్లో బయటపడ్డ.. చల్లటి నిజాలు**

***'ఐస్‌క్రీమ్' మాట వింటేనే పిల్లలకే కాదు, పెద్దలకు కూడా నోరూరుతుంది. చల్లగా.. రుచిగా ఉన్న ఐస్‌క్రీమ్ తినేందుకు అందరూ ఇష్టపడతారు. అందులోనూ ఈ వేసవికాలంలో ఐస్‌క్రీమ్ పార్లర్లకు రద్దీ బాగానే ఉంటుంది. అయితే ఐస్‌క్రీమ్ చల్లగా..హాయిగా ఉంది కదా అని తినేస్తే..చివరకి అది మెల్లగా ఆరోగ్యానికి ముప్పు తెచ్చే ప్రమాదం కూడా ఎంతైనా ఉందని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది.***

ఇటీవల కావలి, గూడూరు తదితర ప్రాంతాల్లోని కొన్ని ఐస్‌క్రీమ్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి ఐస్‌క్రీమ్‌ను పరిశీలించారు. పలువురు తయారీదారులు ఇందులో వాడాల్సిన పాలకు బదులు పాలపొడిని వాడుతున్నారని, చక్కెరకు బదులు తక్కువ ధరకు వచ్చే చాక్రిన్ కలుపుతున్నారని తెలియడంతో అధికారులే ఆశ్చర్యపోయారు. నిబంధనల ప్రకారం ఐస్‌క్రీమ్ తయారీకి పాలు, వెన్న, చక్కెర, శుద్ధిచేసిన నీరు ఉపయోగించాలే తప్ప నాసిరకం పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదు. కానీ, కాసులకు కక్కుర్తి పడుతున్న కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా ఐస్‌క్రీమ్‌ను నాసిరకం సరుకులతో తయారుచేసి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారని బట్టబయలైంది. కాలపరిమితి తీరిపోయిన వస్తువులను, ఆహారంలో వినియోగించకూడని రంగులను కూడా కలిపేసి ఐస్‌క్రీమ్ చల్లగా గొంతులోకి వెళ్ళిపోతుంది కదా.. ఎవరు పట్టించుకుంటారనే నిర్లక్ష్యభావంతో పలువురు తయారీదారులు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, కొన్ని దుకాణాల్లో తుప్పు పట్టిన ఇనుపపెట్టెల్లో ఐస్‌క్రీమ్‌లు తయారు చేసేస్తున్నారని, వాటిని ఆకర్షణీయంగా బొమ్మలతో అట్టపెట్టెల్లో పెట్టి మరీ అమ్మేస్తున్నారని, నాణ్యతా ప్రమాణాలను అసలు పట్టించుకోవడం లేదని అధికారుల పరిశీలనలో తేలింది.

పరిశుభ్రత లేని వాతావరణంలో బాగా నాసిరకంగా తయారవుతున్న అలాంటి ఐస్‌క్రీమ్‌ల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నాసిరకం ఐస్‌క్రీమ్ తయారీదారుల పట్ల, సంబంధిత వ్యాపారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## 22న నింగిలోకి దూసుకెళ్లనున్న...

# పిఎస్ఎల్‌వి సి-46 రాకెట్

శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి ఈనెల 22వ తేది వేకువన 5.27 గంటలకు పిఎస్ఎల్‌వి సి-46 రాకెట్ నింగిలోకి దూసుకువెళ్లనుంది. పిఎస్ఎల్‌వి సిరీస్‌లో 48వ సారి జరిగే ఈ రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సన్నద్ధమవుతున్నారని, ఈ రాకెట్ ద్వారా వాతావరణం, భూ పరిశీలన కోసం రీ-శ్యాట్ 2 బి ఆర్ (రాడార్ ఇమేజింగ్ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్) అనే అత్యంత శక్తివంతమైన ఉపగ్రహాన్ని భూమికి 555 కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెట్టనున్నారని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన అనుసంధాన ప్రక్రియలు కూడా పూర్తిచేస్తున్నారు.




## నరసింహస్వామికి

# వెండి మకరతోరణం



నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న ఆదిలక్ష్మి అమ్మవారికి మామిడి మల్లికార్జున నాయుడు-సీతమ్మ దంపతులు ఈనెల 11న వెండి మకరతోరణాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ మల్లినేని వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యురాలు నెల్లూరు ఝాన్సీ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# గూడూరు డివిజన్ వార్తలు

## మద్యం తాగి వాహనాలు నడిపితే..
# కఠిన చర్యలు తప్పవు



- టూటౌన్ ఎస్ఐ ఆదిలక్ష్మి

వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా చర్యలు తప్పవని గూడూరు టూటౌన్ ఎస్ఐ ఆదిలక్ష్మి హెచ్చరించారు. ఈనెల 12న రెండవ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న 20 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామన్నారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మరో ఇద్దరిపై కూడా కేసులు పెట్టామన్నారు.

## యాదవ విద్యార్థులకు
# 21న ప్రతిభా పురస్కారాలు



మాట్లాడుతున్న మయూరి శ్యామ్‌యాదవ్

జిల్లాలోని 10వ తరగతి యాదవ విద్యార్థిని విద్యార్థులకు యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఈనెల 21వతేది ఉదయం ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షులు, మరియు గుంతకల్లు రైల్వేడివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్ మయూరి శ్యామ్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమం వివరాలను ఆయన గూడూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు. గత 11 సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, నెల్లూరు టౌన్‌హాలులో జరిగే ఈ కార్యక్రమంలో టెన్త్‌లో 8.5 జిపిఏ మరియు ఆపైన జిపిఏ సాధించిన విద్యార్థులు మార్కులు జాబితా, కులం సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 9948606664, 9705800794, 7989361190 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.



నిరాదరణకు గురైన ఓ అమ్మకు మిఠాయి తినిపిస్తున్న చారిటీస్ ప్రతినిధులు

# అమూల్యమైనది.. అమ్మ ప్రేమ

అమ్మ ప్రేమ వెల కట్టలేనిదని, అమ్మ అభిమానం అమూల్యమైనదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరులోని అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 12న జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ కన్నతల్లి కన్నా గొప్పవారు మరెవరూ లేరని, అమ్మని దైవంగా పూజించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సందానీ, కరిముల్లా, బర్కతుల్లా, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరాదరణకు గురైన పలువురు మాతృమూర్తులకు ట్రస్ట్ తరఫున భోజనప్యాకెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

# అనాధలకు ఇన్నర్‌వీల్ ఆదరణ



మానసిక వికలాంగులకు కేశ సంస్కారం చేయించిన ఇన్నర్‌వీల్ సభ్యులు

మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 12న గూడూరు పట్టణంలోని ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు కేశఖండన చేయించి కొత్త దుస్తులు పంపిణీ చేశారు. షిర్డీసాయిబాబా మందిరం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళామండలి గౌరవాధ్యక్షురాలు, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ నేటి సమాజంలో ఎందరో పేదలు అనేక కారణాలతో కుటుంబాలను వదిలేసి అనాధలుగా ఉండడం బాధాకరమని, అలాంటివారిని మానవతా దృక్పధంతో అందరూ ఆదుకోవాలని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నిరుపేదలకు తమవంతు సేవాకార్యక్రమాలు ఎల్లవేళలా చేస్తుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రమహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు విష్ణువందన, ప్రభారెడ్డి, జీవని, ప్రతినిధులు కోటేశ్వరరావు, ప్రసాదరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్షురకులను సన్మానించారు.

# చిరమనకు బాలసాహితీ విభూషణ పురస్కారం

గూడూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి-రచయిత చిరమన వెంకటరమణయ్యకు బాలసాహితీ విభూషణ పురస్కారం లభించింది. శ్రీకాకుళానికి చెందిన బాలరంజని సంస్థ, నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం సంయుక్తంగా నెల్లూరులో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో తనకు ఈ విశిష్ట పురస్కారాన్ని అందజేశారని చిరమన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు చిరమనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచయితలు గోవిందరావు, నాగేశ్వరరావు, గంగిశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 15వ తేదీ విజయవాడలో ఆంధ్రప్రదేశ్ డిజిపి ఆర్.సి.ఠాకూర్ నుండి బెస్ట్ క్రైం డిటెక్షన్ అవార్డును స్వీకరిస్తున్న గూడూరు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వరరాజు

## కామాక్షినగర్ స్మశానవాటికకు
# దారేదీ..?

## 40 ఏళ్ళుగా... ఇదో తీరని సమస్య

గూడూరు మండలంలోని కామాక్షినగర్ స్మశానవాటికకు సంబంధించి దారి సమస్యను వెంటనే పరిష్కరించాలని గూడూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం స్థానికులు, ఎమ్మార్పీయస్ నాయకులతో కలసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత 40 ఏళ్ళుగా ఈ సమస్య ఉందని, స్మశానానికి వెళ్ళేందుకు దారి లేకపోవడంతో గ్రామస్తులు ఎంతో ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మదన్ మోహన్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, బాబు పాల్గొన్నారు.

## • 10వ తరగతి ఫలితాలలో...
# లిటిల్ ఏంజల్స్ జయకేతనం



10కి 10 జిపిఏ సాధించిన జనార్ధన్‌ను అభినందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి

10వ తరగతి ఫలితాలలో చిల్లకూరు మండలం, శారదానగర్‌లోని లిటిల్ ఏంజల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ తన ప్రతిభను నిరూపించుకుంది. పరీక్షలకు 66మంది విద్యార్థులు హాజరుకాగా, అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావడం విశేషం. వీరిలో జనార్ధన్ అనే విద్యార్థి 10కి 10 జిపిఏ సాధించాడు. మరో నలుగురు విద్యార్థులు 9.8 జిపిఏ, 7గురు విద్యార్థులు 9.7 జిపిఏ సాధించి పాఠశాల ఘనతను చాటారని కరస్పాండెంట్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంరెడ్డితో పాటు వైస్‌ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, స్కూల్ అకడమిక్ కో-ఆర్డినేటర్ సుధేష్ణ విద్యార్థులను అభినందించారు.

# సత్తా చాటిన వివిఎస్ఆర్




మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఎస్ఎస్‌సి 2019 ఫలితాల్లో గూడూరులోని వివిఎస్ఆర్ ఇంగ్లీష్‌మీడియం హైస్కూలు విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తా చాటారు. వీరిలో నలుగురు విద్యార్థులు 10కి10 జిపిఏ సాధించి పట్టణంలో ప్రథమస్థానంలో నిలిచారు. పరీక్షకు హాజరైన మొత్తం 49 మంది విద్యార్థుల్లో 30 మంది 9కి పైగా జిపిఏ సాధించారని పాఠశాల యాజమాన్య సభ్యులు బాలకృష్ణంరాజు, అన్నపూర్ణ, సంజయ్‌లు సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. ఈ విజయోత్సాహంలో అకడమిక్ డీన్ రాంప్రసాద్, కోఆర్డినేటర్ శాంతకుమార్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వివేకానంద స్కూల్ ప్రభంజనం



10కి 10 జిపిఏ సాధించిన వెంకటనారాయణను అభినందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ చంద్రమోహన్, డైరెక్టర్ వంశీకృష్ణ

గూడూరు రెండవ పట్టణంలోని శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థులు తాజాగా విడుదలైన ఎస్ఎస్‌సి 2019 ఫలితాల్లో అద్భుతమైన ఫలితాలు సాధించారని పాఠశాల కరెస్పాండెంట్ కె.చంద్రమోహన్ తెలిపారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇద్దరికి పదికి పది పాయింట్లు వచ్చాయని, ముగ్గురు 9.8, మరో పదిమంది 9.7, నలుగురు విద్యార్థులు 9.5 పాయింట్లు సాధించారని ఆయన పేర్కొన్నారు. వీరిలో జి.కె.పూజ, డి.వెంకటనారాయణలు పదికి పది పాయింట్లు సాధించారని, మొత్తం 32 మంది విద్యార్థులు 9.0 పాయింట్లతో ఉత్తీర్ణులయ్యారని విద్యార్థులను ఆయన అభినందించారు. డైరెక్టర్ కె.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాస్పరో విద్యార్థుల ప్రతిభ



విజయ చిహ్నం చూపుతున్నస్కూల్ కరస్పాండెంట్ దశరధరామిరెడ్డి

పదవ తరగతి ఫలితాల్లో గూడూరు పట్టణంలోని ప్రాస్పరో స్కూల్ విద్యార్థులు కె.ప్రభాన్, డి.రమ్యశ్రీ పదికి పది జిపిఏ సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని పాఠశాల కరెస్పాండెంట్ బి.దశరధరామిరెడ్డి తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు ఇందుప్రియ, స్నేహమత్‌లు 9.8జిపిఏ సాధించగా, ఎస్.నందు, వై.శివకుమార్, కె.కార్తీక్‌లు 9.7, బి.మహేశ్వరి, యస్.తల్హా, డి.శ్రీనులు 9.5 జిపిఏలతో ఉత్తీర్ణులయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

గల్పిక

# ప్రధానిగా బాబుకు అన్ని పక్షాల మద్దతు

పశ్చిమబెంగాల్‌లోని పురులియా... విశాల మైదానంలో భారీ బహిరంగసభ. లక్షలాదిమంది ప్రజలు హాజరైవున్నారు. అప్పుడే గాల్లో నుండి ఒక హెలికాప్టర్ వచ్చి హెలిపాడ్‌పై దిగింది. అందులో నుండి మొదట బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దిగి వేదికనెక్కింది. ప్రజల్లో ఎటువంటి చలనం లేదు. కొన్ని క్షణాలలోనే ఆంధ్ర సిఎం, హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు హెలికాప్టర్ దిగి వేదికనెక్కాడు. అంతే... సభ లక్షలాదిమంది చప్పట్లతో చంద్రబాబు జిందాబాద్ అన్న నినాదాలతో మార్మోగిపోసాగింది. ప్రజల్లో చంద్రబాబు పట్ల వచ్చిన స్పందన చూసి మమతా బెనర్జీయే ఆశ్చర్యపోయింది. మమతా బెనర్జీ చాలు చాలు అని వారిస్తున్నా జనాలు చంద్రబాబుకు జేజేలు పలుకుతూనే వున్నారు. మమత ఆశ్చర్యంగా బాబుతో... ఇదేంటి చంద్రబాబు గారు, మా రాష్ట్రంలో కూడా మీకింత క్రేజ్ వుంది, పొరపాటున మీరుగాని పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో పోటీ చేస్తే మమ్మల్ని కూడా చిత్తుగా ఓడిస్తారేమో... మా రాష్ట్రంలోనేనా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కూడా మీ అభిమానులున్నారా? అని అడిగింది. అందుకు చంద్రబాబు... నా అభిమానులు కేవలం ఈ దేశంలోనే కాదు... ప్రపంచంలోని అన్ని దేశాలలో వున్నారు. బిల్‌క్లింటన్, బిల్‌గేట్స్, ఒబామా, ట్రంప్, హిల్లరీ... వీళ్ళంతా నా ఫ్యాన్సే అని చెప్పాడు. అది విని మమత చేత్తో తల కొట్టుకుంటూ అబ్బా తప్పు చేసామే అని అంది. ఏం చేసారు మేడమ్ అని చంద్రబాబు అడిగాడు. ఎన్నికలకు ముందే విపక్షాల ప్రధాని అభ్యర్థిగా మిమ్మల్ని ప్రచారం చేసుకుని వుంటే బాగుండేది. మీ ఇమేజ్‌తో విపక్ష పార్టీలన్నింటికీ సీట్లు వచ్చి వుండేవి. శుభ్రంగా బీజేపీని దించేసి మనమే అధికారంలోకి వచ్చుండేవాళ్ళం. అనవసరంగా ఆ పప్పు... సారీ... ఆ రాహుల్‌గాంధీ ప్రధాని అవుతాడనే ప్రచారం వల్ల గెలుస్తామో లేదో అన్న అనుమానంలో పడ్డాం. సారీ చంద్రబాబు మీకింత క్రేజ్ వుందని తెలియదు. లేకుంటే మిమ్మల్నే ప్రధానిగా అందర్నీ నేను ఒప్పించి ఉండేదాన్ని అని చెప్పింది. దానికి చంద్రబాబు... ఇప్పటికైనా మునిగిపోయిందేముంది మేడమ్... ఇంకా రెండు విడతల ఎన్నికలున్నాయి. ఇప్పటికైనా ప్రధానిగా నన్ను ప్రచారం చేసుకుంటే ఆ రెండు విడతలలోనన్నా నా ఇమేజ్‌ను క్యాష్ చేసుకోవచ్చుగా అని చెప్పాడు. మమత అందుకు సరేనంది. తర్వాత చంద్రబాబు తాను వ్రాసిపెట్టుకున్న బెంగాలీ భాషలో ప్రసంగించి వారిని అలరించాడు. ఆ తర్వాత ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకుని అక్కడ నుండి ఉండవల్లిలోని ఇంటికి వచ్చేశాడు. చంద్రబాబు ఇంట్లో అడుగుపెట్టేసరికి, ఓ మూలన దేవాన్ష్ పుస్తకం పట్టుకుని... అ... అంటే అధికారం, ఆ... అంటే ఆక్రమణ అని చదువుతున్నాడు. ఇంకో మూల లోకేష్ ఒక పేపర్ చేతిలో పట్టుకుని చేయి ముందుకు చాచి "నారా లోకేష్ అనే నేను భారత రాజ్యాంగం పట్ల విధేయుడినై వుంటానని" అంటూ చదువుకుంటూ పోతున్నాడు. చంద్రబాబు అది చూసి... ఏం చేస్తున్నావు లోకేష్ అని అడిగాడు. రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు తప్పులు దొర్లకుండా వుండాలని ఇప్పటి నుండే రిహార్సల్ చేస్తున్నాను డాడీ అని చెప్పాడు. అది విని చంద్రబాబు... అయితే అలాంటి ప్రమాణ పత్రం హిందీలో కూడా ఒకటి తయారు చేయించి పెట్టు... నేను కూడా రిహార్సల్ చేస్తాను... త్వరలో ఢిల్లీలో చదవాల్సి వుంటుంది అని చెప్పి లోపలకు వెళ్లాడు. అప్పుడే బాగా ఎండగా వుండడంతో త్వరగా భోజనం చేసి తన బెడ్ రూంలోకి వచ్చి ఏసి ఆన్ చేసుకుని పడుకున్నాడు.

★★★★★

మే 23వ తేదీ... సాయంత్రం 4గంటలు. రాష్ట్ర, కేంద్ర ఎన్నికల ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలో తెలుగుదేశం అఖండ విజయం సాధించింది. అలాగే కేంద్రంలో బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. కాంగ్రెస్‌తో సహా విపక్ష కూటమిలోని పార్టీలకు మెజార్టీ సీట్లు వచ్చాయి. రాష్ట్రపతి భవన్‌కు నరేంద్ర మోడీ వెళ్లి ప్రధాని పదవికి రాజీనామా చేసి బయటకొచ్చాడు. అక్కడ ఆయన మీడియాతో ఏడుస్తూ మాట్లాడుతూ చంద్రబాబు వంటి మిత్రుడిని దూరం చేసుకున్నందుకు మాకు తగిన శాస్తే జరిగింది. ఆయనే మాతో వుండుంటే ఈరోజు నాకు రాజీనామా చేయాల్సిన అవసరముండేది కాదు. నన్ను క్షమించు చంద్రబాబు అని కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ్లిపోయాడు. ఆ పక్కనే వున్న అద్వానీని... ఓటమిపై మీ అభిప్రాయం చెప్పండి సార్ అని విలేకరులు కోరారు. చంద్రబాబుతో పెట్టుకోవద్దని నేనెప్పుడో చెప్పాను. వీళ్ళు వినలేదు. తగిన శాస్తి జరిగింది. పెద్దల మాట చద్ది మూట అని వూరికే చెప్పలేదు అంటూ ఆయన వెళ్లిపోయాడు.

★★★★★

ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం. అక్కడంతా హంగామాగా వుంది. జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, మాయావతి, శరద్ పవార్, ములాయంసింగ్‌యాదవ్, అరవింద్ కేజ్రీవాల్, ఫరూఖ్ అబ్దుల్లా వంటి అతిరథులున్నారు. ప్రధాని పదవిని ఎవరు చేపట్టాలన్నదానిపై చర్చ పెట్టారు. మమతా బెనర్జీ వుండి... ఇక్కడ రెండో పాయింటే లేదు... చంద్రబాబే ప్రధాని అని చెప్పింది. నా ఓటు కూడా చంద్రబాబుకే అని శరద్ పవార్ లేచాడు. చంద్రబాబు వుండి... నాకు ఈ ప్రధాని పదవి అవసరమా? నా అవసరం మా రాష్ట్రానికి ఇంకా ఎంతో వుంది అని అన్నాడు. వెంటనే అరవింద్ కేజ్రీవాల్ ఆయన గడ్డం పట్టుకుని బాబ్బాబు ఈ ఒక్కసారికి మా మాటను కాదనొద్దు... ప్లీజ్ అని బ్రతిమలాడసాగాడు. మిగతా వాళ్ళు కూడా ప్లీజ్ మా కోసం ఒప్పుకోండి బాబుగారు అని బ్రతిమలాడుతున్నారు. అదంతా చూస్తున్న భువనేశ్వరి.... మా వారికి మా లోకేష్ ఎంత చెబితే అంత... గతంలోనూ ప్రధాని పదవి వద్దని లోకేష్ చెప్పాకే ఆయన వద్దనుకున్నారు. ఇప్పుడు కూడా లోకేష్ ఏది చెబితే అదే! ఉండండి లోకేష్‌ను పిలుస్తానంటూ... లోపలకు వెళ్లసాగింది. చంద్రబాబు ఆదుర్దాగా... భువన వాడిని పిలవొద్దు... తింగరోడు... ప్రధాని పదవి వద్దంటాడు... నా నోటి కాడి పదవి తీస్తాడు... వాడిని పిలవొద్దు... ప్లీజ్ పిలవొద్దు... అని అరవసాగాడు.

ఆ అరుపులకు హాల్‌లో దేవాన్ష్‌తో ఆడుకుంటున్న భువనేశ్వరి పరుగున బెడ్‌రూంలోకి వచ్చింది. నిద్రలోనే చంద్రబాబు పిలవొద్దు... పిలవొద్దు అని అరుస్తున్నాడు. ఆమె చెంబులో వున్న నీళ్ళు తీసి చంద్రబాబు ముఖంపై కొట్టింది. ఆ దెబ్బకు చంద్రబాబు తక్కున లేచి కూర్చున్నాడు. చుట్టూ చూసాడు. అయోమయంగా ముఖం పెట్టి వాళ్ళంతా ఏరి అని అడిగాడు. ఎవరండి అని భువనేశ్వరీదేవి అడిగింది. మమత, మాయావతి, పవార్‌లు అని చంద్రబాబు అన్నాడు. అందుకు భువనేశ్వరీ... మీరేదో కలగన్నారు. ఆ కలలో వాళ్లొచ్చినట్లున్నారు. ఇంతకీ ఏం జరిగిందని అడిగింది. చంద్రబాబు తనకొచ్చిన కల గురించి అంతా వివరించి... భువనా... తెల్లారుజామున వచ్చిన కలలు నిజమవుతాయంటారు... నిజమేనా అని అడిగాడు. తెల్లారుజామున వచ్చిన కలలు నిజమవుతాయంటారు నిజమే... కాని మీకొచ్చింది పగటికల. ఇది తెల్లారుజాము కాదు... మధ్యాహ్నం 4గంటలైంది. మీరు మధ్యాహ్నం తిని పడుకుని నిద్రపోయారు అని చెప్పింది. ఆ మాటకు చంద్రబాబు ముఖం తేలేశాడు.

# కులరహిత సమాజమే అందరి లక్ష్యం కావాలి

**- ప్రముఖ కవి, గాయకుడు గోరటి వెంకన్న పిలుపు**




సభలో మాట్లాడుతున్న గోరటి వెంకన్న

కులరహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని ప్రముఖ కవి, గేయరచయిత, గాయకుడు గోరటి వెంకన్న పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెంలోని అంబేద్కర్‌భవన్‌లో ఈనెల 12న జరిగిన డా. బిఆర్ అంబేద్కర్ జయంతోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన సమాజ నిర్దేశకుడు డా.బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. కుల నిర్మూలన జరగాలని, గౌరీలంకేశ్ వంటి ఎంతోమంది రచయితలు కులనిర్మూలనలో భాగంగా ప్రాణాలర్పించారని ఆయన అన్నారు. మతాల పేరిట ఘోరాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూములన్నీ ప్రభుత్వపరం కావాలని, ప్రైవేటు యాజమాన్యాల వద్ద ఉండకూడదని, మద్యపానాన్ని వాడల్లోకి రానివ్వకూడదన్నారు. అనంతరం పలు గీతాలను, గేయాలను ఆయన ఆలపించి అందరినీ అలరించారు. జాతీయ దళిత హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పచ్చా మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డివి నరసింహారావు, ఎక్సైజ్ సిఐ ప్రసన్నలక్ష్మి, ఏపి షెడ్యూల్ కులాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భీమతాటి వెంకటరమణయ్య, భీమాసతీష్, గంటా తిరుపాలు, విల్సన్ పాల్, కిరణ్, వ్యాఖ్యాత పి.మోహన్‌కుమార్ గాంధీ పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# నైటింగేల్‌ను నర్సులు ఆదర్శంగా తీసుకోవాలి



నర్సు రేవతిని సత్కరిస్తున్న చాట్ల నరసింహారావు

ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ప్రతి నర్సు ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చాట్ల నరసింహారావు అన్నారు. ఈనెల 12న ప్రభుత్వాసుత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు సేవలు అందించిన నర్సులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చాట్ల మాట్లాడుతూ రోగుల సేవలో నర్సులు తరిస్తున్నారని, స్టాఫ్ నర్సులు రోగులపై అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. అనంతరం స్టాఫ్ నర్సులు రేవతీదేవి, రాజేశ్వరి, గిరిజ, శాంతకుమారి, అమరావతి, ఈవెంజలైన్, యశోద, వాణి, కర్జైన పెటర్జి, జ్యోతిలను శాలువ, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. నర్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, ప్రసూన, సుమలత, అమరావతి పాల్గొన్నారు.

# అతివేగం.. ప్రాణాలకే ప్రమాదం

**- ట్రాఫిక్ డిఎస్పీ మల్లికార్జునరావు**

మితిమీరిన వేగం ప్రాణాలకే ప్రమాదకరమని, వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు జాగ్రత్తగా నడపాలని, ట్రాఫిక్ నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ అతిక్రమించకుండా వాహనాలు నడపాలని నెల్లూరు నగర ట్రాఫిక్ డిఎస్పీ మల్లికార్జునరావు హెచ్చరించారు. నెల్లూరు నగరంలోని సర్వోదయ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే సహించేది లేదన్నారు. జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి సూచనల మేరకు నగరంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనేకమంది వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల సరైన అవగాహన లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా వాహనాల పట్ల మరింత మెళకువగా ఉండాలని, తమ బిడ్డలు మైనర్లయితే వారికి వాహనాలు ఇవ్వవద్దని చెప్పారు. మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌ల వంటివాటికి వాహనదారులు దూరంగా ఉండాలన్నారు. నార్త్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వేమారెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మృత్యువాతపడుతున్నది యువతేనని అంటూ యువకులు వాహనాలు నడిపేటప్పుడు తొందరపాటు వద్దని, అతివేగం అసలే వద్దని సూచించారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, నిర్ణీత వేగంలోనే వాహనాలు నడపాలని చెప్పారు. ఈ అవగాహన సదస్సులో అనేకమంది తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు. సౌత్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మధుబాబు, ఆర్ఎస్ఐలు రాఘవయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెంగాళమ్మ పరమేశ్వరికి

# వెండి త్రిశూలం బహుకరణ

నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలో వేంచేసియున్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానానికి ఈనెల 13 న తిరుపతికి చెందిన పీవీ సుధాకర్ బాబు రూ.1.50 లక్షలు విలువ చేసే వెండి త్రిశూలాన్ని అమ్మవారికి బహుకరించారు. దాదాపు 3.5 కిలోల వెండితో తయారు చేసిన ఈ త్రిశూలాన్ని ఆలయం వద్ద కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులురెడ్డికి అందజేశారు.



# సత్తాచాటిన ఎస్ఆర్‌కె

ప్రతియేటా పదవ తరగతి ఫలితాలలో నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని ఎస్ఆర్‌కె స్కూల్ వంద శాతం ఉత్తీర్ణత చాటటం ఆనవాయితీ అయింది. ఈ సంవత్సరం కూడా అదే విధంగా ఈ స్కూలు విద్యార్థులు ఫలితాలు సాధించారు. వంద శాతం ఉత్తీర్ణతతో పాటు ఆరు మంది విద్యార్థులు 10కి 10 జిపిఎ, 9మందికి 9.8 జిపిఎ, నలుగురు 9.7జిపిఎ, 9మందికి 9.5 జిపిఎ, 8మందికి 9.3జిపిఎ, నలుగురికి 9.2 జిపిఎ రాగా, 43మంది విద్యార్థులు 9కిపైన జిపిఎని సాధించడం విశేషం. ఈ ఫలితాల గురించి స్కూల్ కరస్పాండెంట్ పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఒత్తిడిలేని విద్య, ఉపాధ్యాయుల నిబద్ధతతోనే ఈ ఫలితాలు సాధించామని అన్నాడు. ఈ విద్యా సంవత్సరం నుండి ఎస్ఆర్‌కె స్కూల్ మరియు విశ్వసాయి విద్యాసంస్థలు కలిసి పనిచేస్తాయని, ఈ కలయిక వల్ల ఇంకా మంచి ఫలితాలు వస్తాయని విశ్వసాయి విద్యాసంస్థల డైరెక్టర్‌లు డాక్టర్ ఎన్.సత్యనారాయణ, కృష్ణమోహన్‌లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుండి ఈ స్కూల్లో విద్యార్థులను ఎన్‌టిఎస్‌ఇ వంటి పరీక్షలకు సన్నద్ధం చేయడం, ఐఐటి, నీట్ వంటి పోటీ పరీక్షలకు అవగాహన కల్పించడం, కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లను ఆధునీకరించడం చేపడతామన్నారు.




ఈ నెల 10వ తేదీన జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీఅధ్యక్షురాలు స్వర్గీయ పందిళ్ళపల్లి అరుణమ్మ తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని సత్యసాయి అన్నదాన సమాజంలో పేదలకు అన్నదానం నిర్వహిస్తున్న అరుణమ్మ కుటుంబసభ్యులు.

## కన్నుమూసిన కలం వీరుడు..

# కామ్రేడ్ రమణయ్య



***ఎప్పుడూ నవ్వుతూ... గలగల మాట్లాడుతూ... నిజాల్ని నిర్భయంగా చాటుతూ నిజాయితీగల జర్నలిస్టుగా ప్రఖ్యాతిచెందిన విశాలాంధ్ర రమణయ్య ఇక లేరు. అందరితోనూ ఎలాంటి బేషజం లేకుండా స్నేహం చేస్తూ... సమాజ చైతన్యం కోసం నిరంతరం పాటుపడిన మహోన్నత పాత్రికేయుడాయన. ఆయన ఇంటిపేరు 'కె'(కనుపర్తి) అయినా 'కె' అంటే 'కామ్రేడ్'గా ఆయన అందరికీ సుపరిచితులే! ఈనెల 11న అందరినీ శోకతప్తుల్ని చేసి ఆయన తిరిగిరాని లోకాలకు తరలిపోయారు. ఆయన మృతితో పాత్రికేయ రంగం ఒక పెద్దదిక్కును కోల్పోయినట్లయ్యింది. వృత్తిపరంగా ఎంతో నిబద్ధతతో జీవితాంతం పని చేసిన కలం యోధుడు... జర్నలిస్టులందరికీ మార్గదర్శకుడు... మన రమణయ్య గారు. ఆయన మరణవార్తతో జిల్లా పాత్రికేయరంగంతో పాటు ఎంతోమంది ఆయన అభిమానులు, సహచరులు, కుటుంబసభ్యులు అందరూ కంటతడి పెట్టారు.***

నెల్లూరుజిల్లాలో సీనియర్ పాత్రికేయులు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వ్యవస్థాపక సభ్యుడు కనుపర్తి వెంకటరమణయ్య ఈ నెల 11వ తేదీన కనుమూశారు. ఆయన వయసు 85 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కొడవలూరు మండలం మిక్కిలింపేట ఆయన స్వగ్రామం. విద్యార్థి దశ నుండే వామపక్ష భావాలకు ఆకర్షితుడయ్యాడు. విఆర్ కళాశాలలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆయన సహవిద్యార్థి. విద్యార్థి దశలోనే ఆనం వెంకటరెడ్డి, ఆనం సంజీవ రెడ్డిలతో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. నెల్లూరు అర్బన్ బ్యాంక్‌కు 30ఏళ్ళు డైరెక్టర్‌గాను, 5ఏళ్ళు అధ్యక్షుడిగాను సేవలందించారు. 38ఏళ్ళు విశాలాంధ్ర పత్రిక పాత్రికేయుడిగా పనిచేసి విశాలాంధ్ర రమణయ్యగా ముద్రపడ్డారు. ఇంటి పేరు "కనుపర్తి" అయినా ఆయన తనకిష్టమైన వామపక్ష భావజాలంతో పనిచేస్తూ "కామ్రేడ్" రమణయ్యగా ప్రఖ్యాతిచెందారు. ఆయన మంచి రచయిత కూడా. సమాజ సేవాభిలాషతో ఆయన ఎన్నో సత్కార్యాలు చేశారు. 1980 దశకంలో కలెక్టర్‌గా వున్న శ్రీమతి సుజాతరావును ఒప్పించి తన స్వగ్రామమైన మిక్కిలింపేట దళితవాడలో 150మంది పేదలకు పక్కాఇళ్ళు కట్టించిన ఘనత ఆయనది. నెల్లూరు జిల్లా నుండి జర్నలిస్ట్ యూనియన్ కార్యనిర్వాహక కార్యవర్గంలో సభ్యుడిగా ఇంతవరకు పనిచేసింది కేవలం రమణయ్య ఒక్కరే! మాజీఎమ్మెల్యే స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డికి కె.వి. రమణయ్యతో సినిమా స్నేహం ఎక్కువగా వుండేది. వీరిద్దరూ కలిసి ఎక్కువ సినిమాలు చూసేవాళ్ళు. గత కొన్నేళ్ళుగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన ఆయన ఈనెల 11న తన ఆప్తులను, ఆత్మీయులను వదిలి అనంత లోకాలకు తరలిపోయారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఆధ్యాత్మికోత్సవం... నరసింహుని బ్రహ్మోత్సవం

నెల్లూరురూరల్ నరసింహకొండలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఎంతో వేడుకగా జరుగుతున్నాయి. ఈ నెల 12న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 13వ తేదీ ధ్వజారోహణం, శేష వాహనం, 14వతేదీ హంస వాహనసేవ, 15వ తేదీ సింహ వాహన సేవ, 16వ తేదీ హనుమంతు సేవలు ఎంతో వైభవంగా జరిగాయి. ఈ నెల 22వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. అతి ముఖ్యమైన రథోత్సవం ఈ నెల 19వ తేదీన జరుగనుంది. ప్రతిరోజూ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఆలయ ఛైర్మెన్ మలినేని వెంకటేశ్వర్లు, ఇ.ఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డిలు ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.





## వేదగిరి ఘాట్‌రోడ్డులో

# దశావతారాలు

వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఘాట్‌రోడ్డు ఇరువైపులా విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలను ఈ నెల 15వ తేదీ ప్రతిష్టించారు. ఈ విగ్రహాలు ఎంతో ఆకర్షణీయంగా, ఆధ్యాత్మికతను పెంపొందించేలా భక్తులను అలరిస్తున్నాయి. ఈ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మెన్ మలినేని వెంకటేశ్వర్లు, ఇ.ఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.




ఉత్తరక్రియలు

సీనియర్ పాత్రికేయులు, సమాజసేవాభిలాషులు

మా తండ్రి

శ్రీ కె.వి.రమణయ్య గారు

(విశాలాంధ్ర రమణయ్య)

తేది. 11.05.2019 శనివారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమార్తెలు - అల్లుళ్ళు

సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి

జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహాశర్మ

కుమారులు - కోడళ్ళు

కనుపర్తి రామకృష్ణ ప్రసాద్ - మీన

కనుపర్తి దయాశంకర్ - రేణుక

మరియు మనుమలు-మనుమరాళ్ళు

ఉత్తరక్రియలు: తేది.20.05.2019 సోమవారం దశహస్సు

తేది. 21.05.2019 మంగళవారం షోడశం, సపిండీకరణం

తేది.22.05.2019 బుధవారం వైకుంఠసమారాధన

నెల్లూరు ట్రంకురోడ్డులోని తిప్పరాజు వెంకటసుబ్బయ్య సత్రం నందు జరుగును.

కావున తెలియపరచడమైనది. సెల్: 9949048083, 9985400327.


ఇటీవల అమరావతిలో ప్రకృతి వైపరీత్యాలు - సామాజిక బాధ్యత అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలిసి సత్కరిస్తున్న తెలుగుదేశం పార్టీ కర్నాటక రాష్ట్ర సమన్వయకర్త రావి మోహన్‌చౌదరి



# నీతిమాలిన రాతలు...

(3వ పేజీ తరువాయి)

ఆయనకు లభిస్తాయి. కాని, ఆయనకి అంత టైం లేదు. ముందు బురద చల్లేస్తే ఆ తరువాత వాళ్లే కడుక్కుంటార్లే అన్నది ఆయన ఆలోచన. ఇది కొత్తగా ఆయనకు ఏర్పడ్డ లక్షణం కాదు. పలు సందర్భాల్లో పలు విషయాలలో ఇలా బురద చల్లడమే పనిగా ఆయన పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తున్నాడు.

## స్థల యాజమాన్యానికి వస్త్ర దుకాణానికి సంబంధమే లేదు..!

ఇక్కడ మరో విషయం ఆయన పిచ్చి పరాకాష్టకు చేరిందన్న విషయాన్ని రుజువు చేస్తుంది. "పలుకుబడి", "పరపతి" అంటూ పెద్ద పదాలే వాడాడాయన. అసలు దుకాణదారులకి 6 సంవత్సరాల పాటు స్థలాన్ని స్థల యజమానులు లీజుకిచ్చారే తప్ప అందులో వాళ్ళు చేపట్టే నిర్మాణాలకి స్థల యాజమాన్యానికీ అసలు సంబంధమే లేదు. సదరు లీజు స్థలంలో జరిపే నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, చెల్లించవలసిన ప్రభుత్వ పన్నులు అన్నీ దుకాణ యజమానులే చూసుకోవాలి తప్ప స్థల యాజమాన్యానికి సంబంధమే లేదు. వీరిద్దరి మధ్య జరిగిన రిజిష్టర్డ్ లీజు ఒప్పందమే అందుకు సాక్ష్యం. ప్లాన్ వ్యవహారం ఏమరుపాటుతో జరిగిన పొరపాటే తప్ప, కావాలని చేసిన తప్పు కాదు. కొన్ని కోట్ల రూపాయలతో వ్యాపారం చేసే వారికి ఒకటి రెండు లక్షలు ప్రభుత్వానికి కట్టే ఆలోచన వుండదంటే ఎవ్వరూ నమ్మరు. ఆ డాక్యుమెంటు కూడా రిజిష్టర్ ఆఫీసులో లభిస్తుంది. ఆ మాత్రం డాక్యుమెంట్లు తెప్పించుకుని నిజానిజాలు తెలుసుకుని వార్తలు రాసే ఓపిక, నిజాయితీ కూడా ఈ పాతపేపరాయనకి లేవు. ఎవరో చెప్పారు, ఏదో జరుగుతోంది... ముందు మనం బురద చల్లేద్దాం అన్న వింత ధోరణి తప్ప మరొకటి కాదు.

అయ్యా... సంపాదకా, జర్నలిజం అంటే నా గురించి నువ్వు, నీ గురించి నేను రాసుకోవడం కాదు. ఇందుకోసం మన పెద్దలు ఈ పత్రికలు పెట్టలేదు. సమాజ శ్రేయస్సు కోసం, ప్రజలకు ఉపయోగకరమైన వార్తలద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయడమే పత్రికల ముఖ్యఉద్దేశ్యం కావాలే తప్ప, నా మీద నువ్వు, నీ మీద నేను బురద చల్లుకోవడం కాదు. ఇప్పటికైనా నీ తీరు మార్చుకో. నీ కతలు గురించి రాయాలంటే మా దగ్గర చాలానే ఉన్నాయి. ప్రభుత్వం నీ పత్రిక కోసం ఉచితంగా ఇచ్చిన స్థలాన్ని తప్పుడు డిక్లరేషన్‌తో అమ్మిన చరిత్ర నీది. అందుకు మా దగ్గర సాక్ష్యాలున్నాయి. నిన్ను నమ్మి ఓ మిత్రుడు అమెరికా నుండి కోట్ల రూపాయలు వ్యాపారం కోసం పంపిస్తే ఆ మిత్రుడికే వెన్నుపోటు పొడిచి సదరు సంస్థ ఆస్థిని నీ కుటుంబసభ్యుల పేరుతో మార్చుకుని, పోలీసు కేసులు ఎదుర్కొంటున్న ఘనత నీది. అందుకు కూడా మా దగ్గర సాక్ష్యాలున్నాయి. ఇక ఒక మాజీ కేంద్రమంత్రి సాక్షిగా నువ్వు చేసిన పైరవీలు, అక్రమాలు తవ్వే కొద్ది బయట కొస్తాయి. ఇవన్నీ మాకనవసరం. నీ వ్యకిగత జీవితం నీ ఇష్టం. బురదలో పడి దొర్లుతావో లేక బట్టలిప్పి బజార్లో గెంతుతావో అది నీ స్వంత విషయం. దయచేసి నిజానిజాలు తెలుసుకోకుండా ఇలా ఎదుటివారిపైన విషం కక్కకు. ముందు నీ ప్రక్కనే వుంటూ నీకు చెత్త సలహాలిస్తున్న పనికిమాలిన వెధవలతో స్నేహం మానేయ్. నీకున్న అపార అనుభవంతో నిజానిజాలు తెలుసుకునే ప్రయత్నం చెయ్యి. కుళ్ళుతో, అసూయతో, ద్వేషంతో ఇలాంటి గాలివార్తలు రాయడం మానెయ్యి. సమాజంలో జరిగే అనేక విషయాలను పక్కనపెట్టి, కేవలం మా ఎదుగుదలను చూడలేక మామీద అక్కసుతో లేనిపోని దుష్ప్రచారాలు చేయడం మంచిది కాదు. మళ్ళీ మళ్ళీ చెప్తున్నాం... ఇకనైనా మారవయ్యా!..

# బాబుకు బ్రేకులు!

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థిపై ఏకాభిప్రాయం అంటాడు. ఇదెలా వుందంటే 'ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు అల్లు అర్జున్' అన్నట్లుగా వుంది. అసలు ఎన్నికల ఫలితాలు రాకుండానే, ఫలితాలలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వచ్చాయో తెలియకుండానే ప్రధాని పదవిపై ఇంత తొందరపాటు చర్యలు అనవసరం కూడా! అందుకే చంద్రబాబు ప్రయత్నాలకు టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ బ్రేకులు వేసింది. ఫలితాల తర్వాతే ప్రధాని అభ్యర్థి, ప్రభుత్వ ఏర్పాటుపై చర్చలని ముఖాన కొట్టినట్లు చెప్పింది. చంద్రబాబు ప్రయత్నాలకు బ్రేకులు వేయడానికి వారి లెక్కలు వాళ్లకున్నాయి. ఏపిలో తెలుగుదేశంకు ఎన్ని సీట్లు వస్తాయో తెలియదు. అంచనాల ప్రకారం ఏపిలో వైసిపికి, తెలంగాణలో టిఆర్ఎస్‌కు మెజార్టీ సీట్లు వస్తాయనే లెక్క మిగతావాళ్ళకుంది. విపక్ష కూటమిలో చంద్రబాబు వుంటే కేసీఆర్, జగన్‌లు కలవరు. రేపు ఫలితాల తర్వాత ఎన్డీఏకు పూర్తి మెజార్టీ రాకపోతే కేసీఆర్, జగన్‌ల మద్దతు ఎవరికైనా కీలకం అవుతుంది. విపక్ష కూటమి కేసీఆర్, జగన్‌లను కలుపుకుపోవాలనుకుంటే చంద్రబాబును దూరం పెట్టాల్సి వస్తుంది. విపక్ష కూటమిలో చంద్రబాబు హవా ఎక్కువగా వుంటే కేసీఆర్, జగన్‌లు ఇటువైపు కన్నెత్తి కూడా చూడరు. ఈ సాకుతో కేసీఆర్, జగన్‌లు ఎన్డీఏకు దగ్గరయినా అవుతారు. దీనిని ఊహించే మమతా బెనర్జీ లాంటి వాళ్ళు చంద్రబాబు ప్రయత్నాలను నిలువరించారు.

# టెన్త్‌లో మునిసిపల్ పాఠశాలల విద్యార్థుల హవా

నెల్లూరు నగరంలోని మునిసిపల్ పాఠశాలల విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో విజయకేతనం ఎగురవేసారు. 2018లో 78.23శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 81.87శాతం ఉత్తీర్ణత సాధించారు. 13మంది విద్యార్థులు 10/10 జీపీఏతో ఉత్తీర్ణులయ్యారు. 9.8 జీపీఏ 23 మంది, 9.7 జీపీఏ 13మంది, 9.5 జీపీఏ 26మంది, 9.3 జీపీఏ 26 మంది, 9.2 జీపీఏ 26 మంది, 9 జీపీఏ 36 మంది విద్యార్థులు సాధించారు. 10/10 జీపీఏ సాధించిన వారిలో వైవీఎంఎం పాఠశాలకు చెందిన ఎం.కృష్ణమోహన్, కేవీఎన్ ఎస్.నిఖిత, డి.వసంతలక్ష్మీ, బాలాజీనగర్ మునిసిపల్ పాఠశాల నుంచి శిరీష, ఎంఎస్ఎం ఏసీనగర్ స్కూలు నుంచి కృష్ణవంశీ, భార్గవి, బీవీనగర్ కేఎన్ఆర్ స్కూలు నుంచి ఫణిశ్రీ, ప్రణయ్, నరేంద్ర, రిషిత్, భానుప్రసాద్, భారతి, హర్షితలు ఉన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ అబ్దుల్ అజీజ్ విద్యార్థులను నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

# మార్పు దిశగా తీర్పు?

(మొదటి పేజీ తరువాయి)

అందుకు సంకేతమా? సాధారణంగా ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువగా వున్నప్పుడు ఓటింగ్ శాతం పెరుగుతుంటుంది. ఈసారి ఓటింగ్ శాతం పెరగడం మాట అటుంచితే ఓటర్లు కసిగా ఓట్లేశారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల పాలకుల పట్ల వ్యతిరేకత బలంగా వున్నప్పుడు, కొత్త నాయకత్వాన్ని ఆహ్వానిస్తున్నప్పుడు మాత్రమే ఎన్నికల వేళ ఇలాంటి వాతావరణం చోటు చేసుకుంటుందనే అభిప్రాయముంది.

## వైసిపివైపే మొగ్గుందా?

ఎన్నికలకు ముందు కూడా పలు సర్వేలు, జాతీయ మీడియా రాష్ట్రంలో వైసిపి గెలుపు తధ్యమని చెప్పాయి. గెలుపు భారీగానే వుంటుందని కూడా చెప్పాయి. ఎన్నికల తర్వాత పలు సర్వేలు జరిగాయి. ఎన్నికలు జరిగిన తీరును ఓటరు నాడిని లోతుగా విశ్లేషించినవాళ్ళు కూడా వైసిపికే మెజార్టీ స్థానాలని చెప్పారు. అసలు జగన్ ప్రభంజనం అన్నది పనిచేస్తే ఊహించని మెజార్టీ రావొచ్చంటున్నారు. జిల్లాల వారీగా అందుతున్న సమాచారం, స్థానికులు చెబుతున్న దానిని బట్టి అన్ని జిల్లాల్లోనూ వైసిపికే మెజార్టీ సీట్లు రానున్నాయని ఒక అంచనా. ఎన్నికలు ఒకే తరహాలో జరిగాయి. విజయనగరం జిల్లాలో తెలుగుదేశం గాలి, కడపజిల్లాలో వైసిపి గాలి అనేదేమీ లేదు. అంతా ఒకటే గాలి తోలినట్లు సమాచారం. ప్రభాస్ కొత్త సినిమా విడుదలైందనుకుందాం... అది పశ్చిమగోదావరి జిల్లాలో హిట్ కావడం, తూర్పుగోదావరి జిల్లాలో ఫ్లాప్ కావడం జరగదు. హిట్ అయినా ఫ్లాప్ అయినా అంతా ఒకే లెవల్లో వుంటుంది. ఇప్పటి ఎన్నికలకు 2014 ఎన్నికలకు ఏ మాత్రం సంబంధం లేదు. 2014 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత అన్నదే లేదు. ఎందుకంటే ప్రభుత్వంలో వున్న కాంగ్రెస్ జీరో అయ్యింది. చాలా అంశాలలో జగన్ కంటే చంద్రబాబు వైపు మొగ్గు కనిపించింది. కాబట్టి కొంతవరకు జిల్లాల వారీగా ఫలితాలు వచ్చాయి. ఈసారి మాత్రం అలా వుండదు. ప్రభుత్వ వ్యతిరేకత పనిచేసినా, లేదా అనుకూలత పనిచేసినా అన్ని జిల్లాల్లోనూ ఒకే తరహా ఫలితాలు వస్తాయి. అయితే సీట్లు రావడంలో కొంచెం అటూ ఇటూ తేడా ఉండొచ్చు.

ఎన్నికలు జరిగిన విధానం, ఓటర్ల నాడీ ఎటు చూసినా ఈసారి గెలుపు మొగ్గు వైసిపి వైపే కనిపిస్తోందని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాలో కూడా వైసిపికి సానుకూల ఓటు కనిపిస్తుంది. కడప, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం జిల్లాల్లో వైసిపి మెజార్టీ సీట్లు సాధిస్తుందని ఇప్పటికే విశ్లేషకులు అంచనాలు కట్టి సోషల్ మీడియా ద్వారా వెల్లడించి వున్నారు. అనంతపురం, కృష్ణా, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలలోనూ గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తుందని, ఇక్కడ వైసిపికి, టిడిపికి సీట్లు తేడా జిల్లాల వారీగా ఒక ట్రెండు సీట్లు మాత్రమే వుండొచ్చని అంచనా!

## పార్లమెంట్‌లోనూ హవా!

లోక్‌సభలోనూ ఫ్యాన్ స్పీడ్ పెరిగిందని, ఉన్న వాటిల్లో వైసిపికి మూడువంతుల సీట్లు రావచ్చని అంచనా! కృష్ణానదికి దక్షిణం వైపున ఏడు జిల్లాలలో టిడిపి కంటే వైసిపి చాలా బలంగా ఉందని, ఇక్కడే వైసిపికి మెజార్టీ లోక్‌సభ స్థానాలు వస్తాయని విశ్లేషకులు అంటున్నారు. ఇక కృష్ణాకు ఉత్తరం వైపున ఆరు జిల్లాల్లో సగానికి పైగా లోక్‌సభ స్థానాలు వైసిపి ఖాతాలోనే చేరనున్నాయని, కాబట్టి వైసిపికి పార్లమెంటులోనూ ప్రాధాన్యత పెరిగేలా సీట్లు వస్తాయని లెక్కలు వేస్తున్నారు.

## ఒక్క ఛాన్స్ ప్లీజ్

ప్రతి ఎన్నికలలోనూ ఏదో ఒక అంశం ప్రజలపై బలమైన ప్రభావం చూపుతుంటుంది. 1983లో ఎన్టీఆర్ 2రూపాయల కిలో బియ్యం, 1994లో సారా ఉద్యమం, 2004లో వై.యస్. ఉచిత కరెంట్ హామీ... ఇలా ఓట్లను ఒడిసిపట్టే అంశం ఏదో ఒకటి ఉంటుంది. 2019 రాష్ట్ర ఎన్నికల్లో అలాంటి ప్రభావం చూపిన అంశం ఏదన్నా వుందంటే అది... 'జగన్‌కు ఒక్క ఛాన్స్ ఇచ్చి చూద్దాం' అని ప్రజలు ఆలోచించడమే. అవును ప్రజల్లో ఇది బలంగా పనిచేసింది. తనకు ఒక్క అవకాశం ఇవ్వమని అడిగిన జగన్ ఆర్ధ్రతకు ప్రజలు కరిగిపోయారు. ప్రచారంలో ఇదే పల్లవినందుకున్న వైయస్ విజయమ్మ, షర్మిలల ప్రసంగాలకు ఆకర్షితులయ్యారు. అలాగే జగన్ ప్రకటించిన 'నవరత్నాలు' పథకాలు కూడా ప్రజల దృష్టిలో పడ్డాయి. ప్రత్యేకహోదా కోసం జగన్ చేసిన పోరాటాలు యువతను వైసిపి వైపు మళ్ళించాయి. మాట ఇస్తే నిలబడతాడు అనే నమ్మకం కూడా ప్రజలు ఎక్కువగా జగన్ వైపు మొగ్గు చూపడానికి కారణమైంది.

దీంతో పాటు చంద్రబాబుకు వ్యూహాలు పన్నే సమయం ఇవ్వకుండా తొలి విడతలోనే ఎన్నికలు పెట్టడం, టిక్కెట్లు పంపిణీలో బీసీలకు పెద్దపీట వేయడం, అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకోవడం, అన్నివైపుల నుండి అందిన సహకారం, ముఖ్యంగా సోషల్ మీడియా ప్రచారం, సాహిత్యం ద్వారా వచ్చిన ఊపు, ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు.... ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అంటూ కదిలిన కేడర్.... కలిసి వైసిపిని గెలుపు వైపు నడిపించాయని చెప్పవచ్చు.

## ఆడపడుచులపైనే నమ్మకం

వైసిపి శ్రేణులు గెలుపుపై ఎంత ఆత్మ విశ్వాసంతో వున్నాయో, తెలుగుదేశం వాళ్ళు కూడా అంతే ధీమాగా వున్నారు. వాళ్ళు ఐదేళ్ళ చంద్రబాబు పరిపాలనపై నమ్మకంతో కాదు, కేవలం ఎన్నికలకు మూడు నెలల ముందు అమలు చేసిన 'పసుపు – కుంకుమ', పింఛన్‌లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలపై కొండంత ఆశలు పెట్టుకుని వున్నారు. వీటి ప్రభావం ఎంత వరకు వుంటుంది? ఒకవేళ పని చేసినా పార్టీని అధికారంలోకి తెచ్చేంత వుంటుందా?

కేవలం ఎన్నికల ముందు ప్రకటించిన పథకాలతోనే మహిళలు, వృద్ధులు దండెత్తినట్లు వచ్చి తమకు ఓట్లేశారనే నమ్మకం తెలుగుదేశం వర్గాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. వీళ్ళు భారీమెజార్టీల మీద అంచనాలు వేసుకోవడం లేదుగాని, సాధారణ మెజార్టీతోనైనా అధికారంలోకి వస్తామనే ధీమా వ్యక్తపరుస్తున్నారు. అలాగే వైసిపిని దెబ్బతీస్తాడనుకున్న పవన్‌కళ్యాణ్, ఏ పార్టీని దెబ్బతీసాడన్నది ఇవిఎంలను లెక్క పెట్టాకగాని తెలీదు? ఇక అయిదు రోజుల్లో ఫలితాలు రానుండడంతో ఇప్పుడు అంచనాలు వేయడం కూడా వృధానే!

# కనుపూరు ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.15లక్షలు

నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ అమ్మ వారి దేవస్థానంలో హుండీలను ఈనెల 14న లెక్కించారు. 40 రోజులకు గాను భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.15,27,771లు ఆదాయం లభించింది. ఏడాదిపాటు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం వేయగా రూ.5,60,500లుకు ఓ వ్యాపారి దక్కించుకున్నారు. ఆలయ ఇఒలు కోవూరు జనార్ధన్ రెడ్డి, తాతా శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

# అర్చకుల వసతి గృహానికి 10 లక్షలు విరాళం

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుల వసతి గృహ నిర్మాణానికి దేవాలయ పాలకమండలి గౌరవాధ్యక్షుడు కొండముద రమణయ్య రూ.10 లక్షల విరాళాన్ని ఈనెల 13న తన తల్లిదండ్రులు కృష్ణయ్య, సుబ్బరత్నమ్మల చేతుల మీదుగా పాలకమండలి సభ్యులకు అందజేశారు.

# స్కూళ్ళ బస్సులకు ఫిట్ టెస్ట్

ప్రతి ఏటా విద్యాసంవత్సరం ఆరంభానికి ముందు విద్యాసంస్థళకు చెందిన బస్సులను తనిఖీ చేసి అవి బాగున్నాయి అంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు ఇస్తుంటారు. స్కూల్ బస్సులు కండీషన్‌లో వుండడం ఎంతైనా అవసరం. ఒక్కో బస్సులో 50మంది దాకా చిన్నారులుంటుంటారు. తల్లిదండ్రుల ఆశలు వాళ్లే! వాళ్ళను జాగ్రత్తగా ఇంటి నుండి స్కూల్‌కు తీసుకెళ్ళి, తరిగి క్షేమంగా ఇంటికి చేర్చేలా వాహనాలు కండీషన్‌లో వుండాలి. గతంలో ఇలాంటి కండీషన్ లేని వాహనాలే ప్రమాదాలకుగురై పలు సంఘటనలలో ఎందరో విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. అలాంటి దుర్ఘటనలు నివారించడం కోసమే జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తుంటారు.

ఇప్పుడు కూడా జిల్లా రవాణాశాఖ స్కూల్స్ వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు జారీ చేయడానికి జిల్లాలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసింది. నెల్లూరు ఆర్టీఓ ఆఫీసు పరిధిలో గొలగమూడి రోడ్డులో, అలాగే కావలి, గూడూరు, సూళ్లూరుపేట, ఆత్మకూరు ఆర్టీఓ కార్యాలయాలలో వచ్చే నెల 12వ తేదీ వరకు వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు జారీ చేయనున్నారు.

# తెగదెంపులే తలనొప్పి తెచ్చిందా?

## • నిరుత్సాహంలో తెదేపా నాయకులు




*బీజేపీతో తెగదెంపులు చేసుకోవడమే తెలుగుదేశంకు తలనొప్పిగా మారిందా? బీజేపీపై చంద్రబాబు వేసుకున్న అంచనాలు తలక్రిందులయ్యాయా? మోడీతో వైరం కోరి కొరివితో తలగోక్కున్నట్లు అయ్యిందా? తెలుగుదేశం పార్టీ నాయకులలో ప్రస్తుతం ఇవే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు ముగిశాయనేగాని నాయకుల్లో ఉత్సాహం కనిపించడంలేదు. ఇంకో నాలుగు రోజుల్లో ఫలితాలు కూడా రానున్న తరుణంలో టిడిపి నాయకుల్లో రేపు ఏమవుతుందోననే టెన్షన్ నెలకొంది.!*

బీజేపీతో కలిసి వున్నంతవరకు రాష్ట్రంలో తెలుగుదేశం బండి సాఫీగా నడిచింది. చంద్రబాబు హోదాకు బదులు ప్యాకేజీ కావాలంటే వాళ్లిచ్చారు. కేంద్రం చేయాల్సిన పోలవరం ప్రాజెక్ట్ పనిని నేనే చేసుకుంటానంటే ఇచ్చారు. రాజధానికి, ఇళ్ళ నిర్మాణానికి, ఇతర పథకాల అమలుకు భారీగానే నిధులిచ్చారు. వాటితోనే చంద్రబాబు నెట్టుకుంటూ వచ్చాడు. అంతే కాదు, ఆడంబరాలు చేసుకున్నాడు.

అయితే, నోట్ల రద్దు తర్వాత చంద్రబాబు ఆలోచన మారింది. మొదట నోట్ల రద్దు సలహా నాదేనని చెప్పుకున్న చంద్రబాబు, ఆ తర్వాత దానిపై వ్యతిరేకత రావడంతో నాలుక మడతపెట్టి ఇది నాన్సెన్స్ పని అని అరిచాడు. ఆ తర్వాత జిఎస్టీని వ్యతిరేకించాడు. ఎన్డీఏ 2018 బడ్జెట్‌లో ప్రత్యేకహోదా అంశం లేదనే సాకుతో బీజేపీతో తెగదెంపులు చేసుకున్నాడు. అంతేకాదు, కాంగ్రెస్‌తో, ఇతర బీజేపీ వ్యతిరేక పార్టీలతో జతకట్టాడు. కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడంతో చంద్రబాబులో ఉత్సాహం పెరిగింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం చంద్రబాబులో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మోడీ దిగిపోవడం ఖాయమని, కేంద్రంలో తనకు చక్రం తిప్పే అవకాశం వస్తుందనే కలలు కన్నాడు.

అయితే, సీన్ మారింది. దేశ ప్రజలు నోట్ల రద్దు కష్టాలను మరచిపోయారు. జిఎస్టీ ఫలితాలను అనుభవిస్తున్నారు. అగ్రవర్ణ పేదలకు విద్య, ఉపాధి అవకాశాలలో 10శాతం రిజర్వేషన్‌లతో మోడీ గ్రాఫ్ మళ్ళీ పెరిగింది. పాకిస్థాన్‌లోని ఉగ్రశిబిరాలపై వైమానిక దాడులు మోడీ ఇమేజ్‌ను అమాంతం పెంచాయి. రైతుల అకౌంట్లకు నేరుగా ఆర్థిక సాయం వంటి పథకాలు బీజేపీపై వ్యతిరేకతను పోగొట్టాయి.

ఇదే సమయంలో మోడీని వ్యతిరేకించిన చంద్రబాబుకు రాష్ట్రంలో చుక్కలు చూపించారు. తొలివిడతలోనే ఎన్నికలు పెట్టడం అయితేనేమీ, చంద్రబాబు అడుగులకు మడుగులొత్తే అధికారులను మార్చడం వల్లనైతేనేమీ, తెలుగుదేశం నాయకులపై ఐటి దాడులైతేనేమీ... ఈ ఎన్నికల్లో అడ్డదారులు తొక్కాలనుకున్న చంద్రబాబు ఆలోచనలను కట్టిపడేశాయి. మోడీతో చంద్రబాబు గోక్కోవడం వల్లే ఈ ఎన్నికల్లో తమ ఎత్తులు పనిచేయలేదని తెలుగుదేశం నాయకులు బాధపడుతున్నారు.

అదే ఎన్‌డిఏ నుండి బయటకు రాకపోయి వుంటే టిడిపికి ఇంత దారుణ పరిస్థితి ఎదురైవుండేది కాదని, చంద్రబాబుకు ఇంతలా భయపడాల్సిన అవసరం కూడా వుండేది కాదని అంటున్నారు! టిడిపి బయటకు రావడం వల్లే వైసిపి ఎన్‌డిఏకి దగ్గరయిందని, ఈ ఎన్నికలలో కేంద్ర ప్రభుత్వం నుండి అన్ని విధాలా సహకారం పొందడంతో ఎన్నికలలో వైసిపి కంటే వెనుకబడ్డామని అభిప్రాయం తెలుగుదేశం వర్గాలలో కనిపిస్తోంది.

# ఈ పేదోళ్ళు... చదువులో గొప్పోళ్ళు

## పదిలో విజయకేతనం ఎగురవేసిన విపిఆర్ విద్య



విద్యార్థులతో విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ ఆచార్య నారాయణరెడ్డి

ఈ పేదోళ్ళు... చదువులో గొప్పోళ్ళు. ఎంతో కష్టపడి చదువుకుని చదువుల తల్లి ముద్దుబిడ్డలుగా రాణిస్తున్నారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రముఖ విద్యాదాత, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంతో ఉన్నతాశయంతో 'విపిఆర్ విద్య' పాఠశాల నెలకొల్పి ఎందరో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. అందుకు తగ్గట్లుగానే ఆ పాఠశాలలో చదువుతున్న పదవతరగతి విద్యార్థులు ఆయన ఆశయాన్ని నిలబెట్టారు. 2018-19 విద్యాసంవత్సరానికి గాను అత్యుత్తమ ఫలితాలను సాధించి తమ సంస్థకు మంచిపేరు తేవడమేకాక, సంస్థ తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. ఈ స్కూల్ నుండి మొత్తం 30మంది పదవ తరగతి పరీక్షలు వ్రాయగా, అందరూ ఉన్నతమైన మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. నలుగురు విద్యార్థులు 10జిపిఏ సాధించగా, 22మంది విద్యార్థులు 9జిపిఏకు పైన సాధించారు. మిగిలిన నలుగురు కూడా 8.8, 8.5, 8.3 జిపిఏలు సాధించడం విశేషం. 2016లో విపిఆర్ విద్యను విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంతో ఉన్నతాశయంతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్థాపించారు. ఆయన సతీమణి, విపిఆర్ ఫౌండేషన్ కో-ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్వయంగా విపిఆర్ విద్యను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఫలితాలనుద్దేశించి విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది నిరుపేద చిన్నారులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే అవకాశం తమకు దక్కిందన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు అన్ని వసతులు ఉచితంగా కల్పిస్తున్నామని, ఈ ఫలితాల వెనుక వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీమతి ప్రశాంతిరెడ్డిల కృషి ఎంతో వుందని పేర్కొన్నాడు. ఈ విజయంలో భాగస్వామి అయిన ప్రిన్సిపల్ వి.టి.శ్రీనివాసులును, అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.


46 YEARS OF EXCELLENCE IN EDUCATION
'శీలేన శోభతే విద్య'

SSC 2019 ఫలితాలలో
రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలచిన...
రత్నం స్కూల్స్
డే & రెసిడెన్షియల్స్



SRI. K.V. RATNAM

1

IIT, మెడికల్ ఫౌండేషన్ వంటి అద్భుతమైన ప్రోగ్రామ్స్ నిర్వహిస్తూ కూడా SSC ఫలితాలలో నెం.

విలువలు... క్రమశిక్షణతో కూడిన విద్యనందించడంలో,
46 సం॥ల సుదీర్ఘ అనుభవం ఉన్న ఏకైక విద్యా సంస్థ

10 GPA ల ప్రభంజనం

163 Students who made us proud by securing GPA score of 10/10

788 Students Secured above 9/10

సబ్జెక్టు వారిగా 10 GPA గ్రేడ్లు సాధించిన విద్యార్థులు

| | | | |
|---|---|---|---|
| సైన్స్ | 378 | సోషల్ | 474 |
| మ్యాథ్స్ | 464 | తెలుగు | 616 |
| హింది | 445 | ఇంగ్లీషు | 728 |
| పరీక్షకు హాజరైన మొత్తం విద్యార్థులు | 1271 | | |

| GPA | 10/10 | 9.8 ABOVE 10 | 9.7 ABOVE 10 | 9.5 ABOVE 10 | 9.3 ABOVE 10 | 9.2 ABOVE 10 | 9.0 ABOVE 10 |
|---|---|---|---|---|---|---|---|
| Number of Students | 163 | 268 | 384 | 486 | 577 | 690 | 788 |

కె.వి. రత్నం, ఛైర్మన్ | కె. వేణుగోపాల్, మేనేజింగ్ డైరెక్టర్ | డా॥ కె. క్రిష్ణ కిషోర్, M.S. (Ortho.), అకడమిక్ డైరెక్టర్

RATNAM HIGH SCHOOL SINCE - 1973
రత్నం స్కూల్స్ నెల్లూరు
డే & రెసిడెన్షియల్ స్కూల్స్

PIDATHAPOLUR 92480 48090, 70135 81727 | SARASWATHI NAGAR 92464 33550, 92464 33681 | HARANATHPURAM 87900 42323, 7702000054

ఘన విజయాలు సాధించిన మా విద్యార్థినీ, విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు..
ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదములు..
ఈ విజయాలకు కారకులైన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు...

అడ్మిషన్లు జరుగుచున్నవి.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com